జ్ఞాని పురుష్ దాదా భగవాన్ నిర్దేశించిన

# చింత



చింతించటం అతి పెద్ద మూర్ఖత్వమే అవుతుంది

జ్ఞాని పురుష్ దాదా భగవాన్ నిర్వచించిన

# చింత

మూలం - గుజరాతి

సంకలనం - డా.నీరూ బెహన్ అమీన్

హిందీ అనువాదం - మహాత్మాగణం

హిందీ నుండి తెలుగు అనువాదం

మహాత్మాగణం

**ప్రకాశకులు** : అజీత్ సి.పటేల్
దాదా భగవాన్ విజ్ఞాన్ ఫౌండేషన్
1, వరుణ్ అపార్ట్‌మెంట్, 37,శ్రీమాలి సొసైటీ
నవరంగ్‌పురా పోలీస్ స్టేషన్ ఎదురుగా,
నవరంగ్‌పురా, అహ్మదాబాద్ – 380009
గుజరాత్, భారత్
**ఫోన్:** + 91 79 3500 2100

© Dada Bhagwan Foundation,
5, Mamta Park Society, B\h. Navgujarat College,
Usmanpura, Ahmedabad -380014, Gujarat, India.
**Email :** info@dadabhagwan.org
**Tel :** + 91 79 3500 2100

**All Rights Reserved. No part of this publication may be shared, copied, translated or reproduced in any form (including electronic storage or audio recording) without written permission from the holder of the copyright. This publication is licensed for your personal use only.**

**First Edition** : November 2023 (500 copies)

**భావ మూల్యం** : 'పరమ వినయం', మరియు "నాకు ఎంతమాత్రం తెలియదు. అదే భావన

**Price** : Rs. 30

**ముద్రిక** : అంబా మల్టి ప్రింటింగ్
B–99, ఈలెక్ట్రానిక్స్ GIDC
క–6, రోడ్డు సెక్టర్–25
గాంధీనగర్ – 382044
గుజరాత్, India
**ఫోన్:** +91 79 3500 2142

ISBN No: 978-93-91375-29-4

**Printed in India**

## త్రిమంత్రం

(సర్వ విఘ్న నివారణ చేసే మంత్రం)







నమో అరిహంతాణం

నమో సిద్ధాణం

నమో ఆయరియాణం

నమో ఉవజ్ఝాయాణం

నమో లోయే సవ్వ సాహూణం

ఏసోపంచణమోక్కారో,

సవ్వాపావప్పణాసణో

మంగళా ణం చ సవ్వేసిం,

పఢమం హవయీ మంగళం

ఓం నమో భగవతే వాసుదేవాయ

ఓం నమో శివాయ

జై సచ్చిదానంద



# దాదా భగవాన్ ఎవరు?

అది జూన్ 1958 లో ఒక సాయంత్రం సమయం సుమారు 6:00, ప్రదేశం రద్దీగా ఉన్న సూరత్ పట్టణ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫార్మ్ నం.3.లో బెంచీ మీద కూర్చునివున్న శ్రీ అంబాలాల్ మూల్జీ భాయ్ పటేల్ అనే దేహమందిరంలో, ప్రకృతిపరంగా, అక్రమ రూపంలో, ఎన్నో జన్మలుగా వ్యక్తమయ్యేందుకు ఆత్రుతగా ఎదురుచూస్తున్న 'దాదా భగవాన్' పూర్ణ రూపంలో ప్రకటితమయ్యారు, ఆధ్యాత్మిక అద్భుతంలా. ఒక గంట సమయంలోనే ఆయనకు విశ్వ దర్శనం అయింది. "నేనెవరు? భగవంతుడు ఎవరు? విశ్వాన్నంతా ఎవరు నడిపిస్తున్నారు? కర్మ అంటే ఏమిటి? ముక్తి అంటే ఏమిటి?" ఇలాంటి ప్రపంచంలో ఆధ్యాత్మిక ప్రశ్నలన్నిటికీ సమాధానం వచ్చింది. ఈ విధంగా దైవం, విశ్వానికి సంబంధించిన ఒక అద్వితీయమైన పూర్ణ స్వరూప దర్శనం కావించింది, దాని ఫలస్వరూపమే శ్రీ అంబాలాల్ మూల్జీ భాయ్ పటేల్, గుజరాత్‌లోని చరోతర్ క్షేత్రంలోని భాదరణ్ గ్రామంలో పాటీదార్, ఒక కాంట్రాక్ట్ పని చేసే వ్యక్తి, అయినా కూడా సంపూర్ణ వీతరాగ పురుషుడు.

"వ్యాపారంలో ధర్మం పాటించాలి కాని, ధర్మాచరణలో వ్యాపారం చేయగూడదు" అనే సిద్ధాంతంతోనే ఆయన జీవితమంతా గడిపారు. ఆయన ఎప్పుడూ ఎవరి దగ్గరి నుంచీ డబ్బు తీసుకోలేదు సరికదా తన ఆదాయం నుంచే తీర్థయాత్రలు చేసే భక్తులకు ఆర్థిక సహాయం చేసారు.

ఆ విధంగా ఆయనకు కేవలం రెండు గంటలలోనే సిద్ధించిన అద్భుతమైన జ్ఞానాన్ని ఉపయోగించి, ఆయన ఎందరో ముముక్షువులకు ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించారు. దాన్ని ఆయన అక్రమ మార్గం అని అన్నారు. అక్రమ అంటే ఒక క్రమం లేని అర్థం. క్రమం అంటే ఒక మెట్టు పైన మరో మెట్టుని క్రమంగా ఎక్కుతూ వెళ్ళటం. అక్రమ మార్గమంటే షార్ట్‌కట్‌లో లిఫ్ట్ ద్వారా పైకి చేరుకోవటం.

ఆయన "దాదా భగవాన్ ఎవరు" అన్న రహస్యాన్ని స్వయంగా చెప్తూ, "మీ ముందు కనిపిస్తున్న ఈ ఆకారం దాదా భగవాన్ కాదు. ఈయన ఎ.ఎమ్.పటేల్. మేము ఒక జ్ఞానపురుషుడను, లోపల ప్రకటితమైనది దాదా భగవాన్. దాదా భగవాన్, 14 లోకాలకు నాధుడు. ఆయన మీలో కూడా ఉన్నాడు. అందరిలోనూ ఉన్నాడు. మీలో అవ్యక్త రూపంలో ఉన్నాడు, నాలో సంపూర్ణ రూపంలో వ్యక్తమై ఉన్నాడు. ఆ దాదా భగవాన్ గారికి నేను కూడా ప్రణామం చేస్తాను"

# ఆత్మజ్ఞానానికి ప్రత్యక్ష లింక్

"నేను నా చేతులతో కొందరికి సిద్ధిని ప్రసాదించబోతున్నాను. నా తర్వాత ముందుకు నడిపేవాళ్ళు ఉండాలి కదా! నా తర్వాత కూడా మనుషులకు మార్గం చూపించేవాళ్ళుండాలి కదా!"

–దాదాశ్రీ

పరమ పూజ్య దాదాశ్రీ పల్లెపల్లెకు దేశవిదేశాలలో తిరుగుతూ ముముక్షువులకు సత్సంగం, ఆత్మజ్ఞాన ప్రాప్తిని కలిగిస్తూవచ్చారు. వీరు తమ జీవితకాలంలోనే పూజ్య డా.నీరు బెహన్ అమీన్ (నీరూ మా) కి ఆత్మజ్ఞానాన్ని కలిగించి జ్ఞానసిద్ధిని ప్రసాదించారు. దాదాశ్రీ దేహాన్ని చాలించిన తర్వాత నీరూ మా, ముముక్షువులకు సత్సంగం, ఆత్మజ్ఞాన ప్రాప్తిని నిమిత్త భావనతో చేస్తూవస్తున్నారు. పూజ్య దీపక్ భాయ్ దేశాయ్‌కి దాదాశ్రీ, సత్సంగాన్ని నిర్వహించే సిద్ధిని ప్రసాదించారు. నీరు మా సమక్షంలోనే, ఆమె ఆశీర్వాదంతోనే పూజ్య దీపక్ భాయి దేశవిదేశాలలో ఎన్నో ప్రాంతాలకు వెళ్ళి, ముముక్షువులకు ఆత్మజ్ఞాన ప్రాప్తిని కలిగించి వచ్చారు. ఆ పని ఇప్పటికీ నీరూమా దేహాంతం తర్వాత కూడా కొనసాగుతూనేవుంది. ఆత్మజ్ఞాన ప్రాప్తి తర్వాత ఎందరో ముముక్షువులు ప్రపంచంలో ఉంటూ, తమ తమ బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తూ, ముక్త పురుషులుగా ఆత్మానందాన్ని అనుభవిస్తున్నారు.

ఈ గ్రంథంలో ముద్రితమైన వాణి, మోక్షార్థుల మార్గదర్శనంలో ఎంతో ఉపయోగకరం. కానీ, మోక్షప్రాప్తి కోసం ఆత్మజ్ఞానాన్ని పొందటం అవసరం. అక్రమ మార్గంలో ఆత్మజ్ఞానాన్ని పొందేందుకు ఇప్పటికీ మార్గం తెరిచేవుంది. దీపకళిక మరో దీపాన్ని వెలిగించినట్లుగానే, ప్రత్యక్షంగా ఆత్మజ్ఞాని నుంచే ఆత్మజ్ఞాన ప్రాప్తిని కలిగించుకొని తన ఆత్మను జాగృతం చేసుకోవచ్చు.

# సంపాదకీయం

చింత ఎవరికి ఉండదు? ప్రపంచంలో నిజమైన విరక్తితో వైరాగ్య భావన కలిగినవారికి మాత్రమే చింత అనేది ఎంతమాత్రమూ ఉండదు. మిగతావారందరికీ చింత ఉండటం సహజం. చింత పర్యవసానం ఏమిటి? చింతారహిత స్థితిని ఎలా పొందాలి? వీటిని అర్థం చేసుకునేందుకు, సూక్ష్మాలను తెరిచేందుకు అవసరమైన తాళంచెవిని పరమపూజ్య దాదాశ్రీ మనకు అందించారు. అదే ఇక్కడ ప్రచురించటం జరిగింది.

చింత అంటే ఆవిర్భవించిన అగ్ని. అది నిరంతరం జ్వలిస్తూనేవుంటుంది. రాత్రిళ్ళు నిద్ర కూడా పోనివ్వదు. ఆకలిదప్పులను కూడా కొల్లగొడుతుంది, ఎన్నో రోగాలకు తలుపులు తెరుస్తుంది. అంతటితో చాలక, మరుజన్మ జంతు జన్మ అయ్యేట్లుగా చేస్తుంది. దానితో ఈ జన్మ, తర్వాత వచ్చే జన్మ, రెండూ చెడిపోతాయి.

చింత అనేది అహంకారమే అవుతుంది. దేని ఆధారంగా ఈ ప్రపంచమంతా నడుస్తోంది– అన్న విషయాన్ని తెలుసుకోకపోవటంతో, అంతా తన నెత్తిమీదనే వేసుకొని, కర్తృత్వ భావనలో జీవిస్తూ, అందుకు మూల్యం చెల్లించవలసివస్తోంది. సుఖదుఖాలనే అనుభవాలు కేవలం అహంకారికి మాత్రమే ఉంటాయి. నేనే కర్తను, నేనే భోక్తను అనే భావాలు అహంకారికే కలుగుతాయి.

చింతించటం ప్రారంభిస్తే చేస్తున్న పని చెడిపోవటం ఖాయం. ఇది ప్రకృతి ఒక చట్టము (కానున) ఉంది. చింత నుంచి విముక్తి అయినప్పుడు ఈ కార్యము స్వయంగా జరిగిపోతుంది.

పెద్దవాళ్ళకి చింతలు కూడా పెద్దవే. ఎయిర్‌కండిషన్ గదిలో కూర్చున్నా చింతలో మునిగిపోయివుండటమే జరుగుతుంది. కాయకష్టం చేసి జీవించేవారికి ఏ చింతా ఉండదు. వాళ్ళు ప్రశాంతంగా నిద్రిస్తారు. కానీ, ఈ సేఠ్‌లకు మాత్రం నిద్ర మాత్రలను సేవించే అవసరం పడుతుంది. జంతువులకు ఎప్పుడైనా చింత కలుగుతుందా?

కూతురు 10 సంవత్సరాల ప్రాయానికి వచ్చేసరికి ఆ అమ్మాయి పెళ్ళి గురించి మధనపడటం మొదలౌతుంది. అరె నాయనా, ఆ అమ్మాయి కోసం ఎక్కడో ఒక దగ్గర వరుడు పుట్టే ఉంటాడు కదా, లేకపోతే ఇంకా పుట్టలేదు అని అనుకుంటారా?

చింతాక్రాంతుల ఇంట్లో లక్ష్మి నిలవదు. చింత వలన అంతరంగంలో కర్మ ఒకటి తయారౌతుంది.

చింత అని దేన్ని అంటారు? ఆలోచించటం తప్పు కాదు కాని, ఆ ఆలోచనల సుడులు తిరుగుతూవుంటే చింత అనేది ప్రారంభమౌతుంది. ఆలోచనల వలన మానసిక ఒత్తిడి మొదలైనట్లయితే, అక్కడ ఆగిపోవాలి.

నిజంగా కర్త ఎవరు? దీన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోవటం వలనే మనసులో చింత మొదలౌతుంది. కర్తృత్వమనేది సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్. ప్రపంచంలో స్వయం ప్రతిపత్తిగల కర్త ఎవరూ లేరు. అందరూ నిమిత్తమాత్రులే

చింత పూర్తిగా పోయేదెప్పుడు? కర్తను అనే హోదాని ఆపాదించుకోవటం మానేసినప్పుడు. కర్తననే హోదా ఎప్పుడు పోతుంది? ఆత్మజ్ఞానం ప్రాప్తించినప్పుడు.

**–డా.నీరూ బెహన్ అమీన్**

దాదా భగవాన్ నిర్వచించిన

# చింత

## చింత అనేది ఎక్కడి నుంచి కలుగుతుంది?

**దాదాశ్రీ:** నీవు ఎప్పుడైనా చింతించటం జరిగిందా?

**ప్రశ్నకర్త:** చింతించటం మానవ స్వభావం కదా, అందువలన ఏదో ఒక రూపంలో చింత అనేది కలుగుతూనేవుంటుంది.

**దాదాశ్రీ:** మనిషి స్వభావం ఎలా ఉంటుందంటే, ఎవరైనా చెంప మీద కొడితే, తిరిగి అతని చెంప మీద కొడతాడు కానీ, వివేకం కలిగినవాడైతే, 'చట్టాన్ని నా చేతిలోకి తీసుకోగూడదు కదా!' అనుకుంటాడు. కొందరైతే చట్టాన్ని వాళ్ళ చేతుల్లోకి తీసుకుంటారు కూడా. అలాగే, చింతించటమనేది కూడా చట్టాన్ని చేతిలోకి తీసుకున్నదానితో సమానమే. అలా చేతిలోకి తీసుకోవటం అపరాధం అనిపించుకుంటుంది. అసలు మనిషికి చింతించవలసిన అవసరమేమిటి? దేవుళ్ళందరూ, 'చింతించకు నాయనా! నీ బాధ్యతలను నాకు వదిలేయి' అనే అంటారు.

**ప్రశ్నకర్త:** అలా చెప్పటం, దాన్ని నిజంగా అమలుచెయ్యటంలో చాలా తేడా ఉంటుంది.

**దాదాశ్రీ:** లేదు లేదు, నేను నిజంగా వదిలేయమని చెప్పటం లేదు. నేను అటువంటి

మనిషి గురించి చెప్తున్నానంతే. చింత అంత తేలిగ్గా వదలదు. చింతించకూడదు నిజమే కానీ, చింత అనేది అందరికీ కలుగుతుంది. ఏమిటి?, మరి అలా చింత అనేది కలిగినప్పుడు ఏ మందు వేస్తావు దానికి? చింతకి మందు అనేది దొరుకుతుందా ఏమిటి?

## చింత ఉన్నచోట అనుభూతి ఎక్కడి నుంచి కలుగుతుంది?

**ప్రశ్నకర్త:** చింతలను పోగొట్టమని భగవంతుడిని ప్రార్థిస్తాం. వీటినుండి ఎప్పుడు విముక్తి కలుగుతుంది అని అడుగుతాం. దానికోసం 'భగవంతుడా భగవంతుడా' అని తలచుకుంటూవుంటాం. ఈ పద్ధతిని వదిలి ముందుకు వెళ్ళాలని అనుకుంటున్నాను కాని, నాలో ఉండే పరమాత్మ అనుభూతి నాకు కలగటం లేదు.

**దాదాశ్రీ:** ఎలా వస్తుంది ఆ అనుభూతి? చింతిస్తున్నప్పుడు అనుభూతి అనేది కలుగదుకదా! మనసులో చింత, అనుభూతి ఈ రెండిటికీ ఒకేచోట, ఒకేసారి స్థానం ఉండదు. చింతించటం ఆగిపోతేనే అనుభూతి కలిగే అవకాశం ఉంటుంది.

**ప్రశ్నకర్త:** చింత ఎలా సమసిపోతుంది?

**దాదాశ్రీ:** ఇక్కడ సత్సంగంలో కూర్చుంటూవుండటం వలన! ఎప్పుడైనా సత్సంగానికి వచ్చావా?

**ప్రశ్నకర్త:** వేరే చోట సత్సంగానికి వెళ్తుంటాను.

**దాదాశ్రీ:** ఏ సత్సంగానికైనా వెళ్ళినపుడు నీ చింత దూరమవలేదనుకో, అలాంటప్పుడు అక్కడికి పోవటం ఎందుకు? పోవద్దు మరి! సత్సంగంలో నిజానికి చింత దూరమవాలి.

**ప్రశ్నకర్త:** అక్కడ కూర్చున్నంత సేపు మనశ్శాంతిగా ఉంటుంది.

**దాదాశ్రీ:** దాన్ని శాంతి అనరు. అందులో శాంతి అనేదేమీ లేదు. బయట సాధారణంగా మాట్లాడుకునే మాటల వలన కూడా అటువంటి శాంతి లభిస్తుంది. నిజమైన

మనశ్శాంతి ఎప్పుడూ ఉండాలి. ఏ సత్సంగంలో చింత కొనసాగుతుంటుందో అటువంటి సత్సంగంలోకి పోవటమెందుకు? సత్సంగం నిర్వహించేవాళ్ళకి చెప్పు, 'బాబూ మాకు చింత కలుగుతూనే వుంటోంది కనుక ఇక నేను ఇక్కడి రాను. లేదా నా చింత దూరమయే మార్గాన్నైనా నాకు సూచించండి!' అని.

**ప్రశ్నకర్త:** ఆఫీసుకి వెళ్ళినా, ఇంటికి వచ్చినా నాకు ఎక్కడా మనసు నిలవదు.

**దాదాశ్రీ:** మనం ఆఫీసుకి వెళ్ళేది ఉద్యోగం చెయ్యటానికి– ఎందుకంటే మనకి జీతం డబ్బులు కూడా అవసరమే కదా! సంసారాన్ని నడపాలిగామరి! అంటే సంసారాన్నీ వదిలిపెట్టగూడదు, ఉద్యోగాన్నీ వదిలిపెట్టగూడదు. కానీ, చింతించటం పోని సత్సంగాన్ని మాత్రం వదిలిపెట్టేయాలి. మరో సత్సంగాన్ని వెతుక్కో. సత్సంగాలు చాల రకాలుగా ఉంటాయి. కాకపోతే సత్సంగంలో చింత దూరమవాలి. వేరే ఏదైనా సత్సంగానికి పోలేదా?

**ప్రశ్నకర్త:** కాని, భగవంతుడు మనలోపలే ఉంటాడని నేను విన్నాను. శాంతి మీకు లోపలి నుంచే వస్తుంది కాబట్టి బయట దాని కోసం వెతుకుతూ తిరగవద్దని అన్నారు.

**దాదాశ్రీ:** ఔను. అది నిజమే!

**ప్రశ్నకర్త:** అయితే, లోపల విరాజమానుడైన దేవుని అనుభవం నాకు ఏమాత్రం కలగటం లేదు.

**దాదాశ్రీ:** చింత ఉన్నప్పుడు అనుభవం కలుగదు. చింత వీడనప్పుడు ఏమైనా అనుభవం కాస్తో కూస్తో వచ్చినా అది కనపడదు. చింత అనేది ఒక రకమైన అహంకారం. 'నువ్వు అహంకారం చూపిస్తే నా దగ్గర ఉండకు పో' అంటాడు దేవుడు. అంతా నేనే నడుపుతున్నాను, నా వలనే అంతా జరుగుతుంది అనే అహంకారం ఉన్నట్లయితే అది చింత కలగటానికి కారణమౌతుంది కదా! భగవంతుని మీద ఏమాత్రం విశ్వాసం లేనివాడే అన్నిటికీ చింతిస్తుంటాడు.

**ప్రశ్నకర్త:** దైవం మీద విశ్వాసమైతే ఉంది.

**దాదాశ్రీ:** విశ్వాసమనేదే ఉంటే అలా జరగదుగా! భగవంతునికే అన్నీ వదిలిపెట్టి హాయిగా దుప్పటి కప్పుకుని పడుకునివుండేవాడివి. అలా చేస్తే ఇక చింత అనేది ఎక్కడుంటుంది? అందువలన భగవంతుని నమ్ము. భగవంతుడు నీకు కొద్దో గొప్పో చేస్తునేవుండివుంటాడు. అన్నం తిన్న తర్వాత నువ్వేమైనా చింతిస్తూవుంటావా– జఠర రసం తయారైందో లేదో, పిత్తము పనిచేస్తుందో లేదో అని? నేను తిన్నదాని వలన రక్తం తయారౌతుందో లేదో, ఇందులోంచి విరోచనం అవుతుందో లేదో అని ఆలోచిస్తూ చింతిస్తావా? నేను చెప్పేదేమిటంటే, లోపలి విషయాల గురించి చింతించనప్పుడు, బాహ్యంలోని విషయాల గురించి చింత ఎందుకయ్యా? అలా చేస్తే మరి భగవంతునికి చికాకు వేయదు? అహంకారం ఉంటే చింత ఉంటుంది. చితించేవాడిని అహంకారి అనే అనాలి. ఒక వారం రోజులపాటు అన్నీ దేవుడికి వదిలేసి చింతపడటం మానేసి చూడు. అప్పుడు రా. ఇక్కడ నీకు దైవసాక్షాత్కారం కలిగిస్తాం. దానితో చింత అనేది శాశ్వతంగా నిన్ను వదిలిపెట్టిపోతుంది.

## చింత అంటే రగిలే నిప్పు

కాబట్టి, మీరంతా తెలుసుకోవలసింది ఏమిటంటే, ఒట్టిగా లోపల నోరు నొక్కేసే మందు వేసుకున్నందువలన లాభమేమిటి? వీళ్ళంతా లోపల నోరు మూయించే మందు వేసేసుకున్నారు. లేకపోతే, మనిషికి చింతించవలసిన అవసరమేముంటుంది అసలు? భారతవాసులకు చింత అనేది ఎక్కడైనా వుంటుందేమో! మీకు చింతించే సరదా ఉందా ఏమిటి?

**ప్రశ్నకర్త:** లేదు నేను శాంతినే కోరుకుంటున్నాను.

**దాదాశ్రీ:** చింత అంటే నిప్పే. ఇట్లా అవుతుందేమో, అట్లా అవుతుందేమో! ఏ సమయంలోనైనా మానవ సంస్కారమనేది సంప్రాప్తమయ్యే భాగ్యం కలుగుతుందేమో, అలాంటప్పుడు చింతించటం మొదలుపెడితే ఆ మానవత్వం కాస్తా మంటగలుస్తుంది. ఎంతటి ప్రమాద పరిస్థితో చూసారా? మీకు కావలసింది శాంతి అయితే, నేను మీ చింతను శాశ్వతంగా పోగొడతాను.

చింత పోగానే దాన్ని, అంతరంగంలోని పరమాత్మ మోక్షమార్గం అని అంటారు. అంతరంగంలోని పరమాత్మ దర్శనం కలుగగానే చింత దూరమవాలి మరి! కాకపోతే అలా దర్శనం చేసుకోవటమే చేతకావటంలేదు. భగవంతుని దర్శనం చేసుకునే విధానాన్ని జ్ఞానులే తెలియజేస్తారు. ఇలా చేస్తే దర్శనం కలుగుతుంది, నీ పని నెరవేరుతుంది అని సూచిస్తారు. చింతలోనే నిప్పు రాజుకుంటుంది. చిలకడదుంపను చూసారా? నిప్పుల్లో వేస్తే అది ఉడుకుతుంది కదా, అలా అవుతుంది.

## జ్ఞానుల కృపాదృష్టితోనే చింత దూరం

**ప్రశ్నకర్త:** అయితే, చింత నుంచి విముక్తులవాలంటే ఏంచేయాలంటారు?

**దాదాశ్రీ:** నీలాగే ఇదిగో ఈయన కూడా ఎన్నో చోట్లకి తిరిగితిరిగి చూసాడు కానీ, ప్రయోజనమేమీ లేకపోయింది. అప్పుడు ఇతను ఏం చేసాడో ఇతన్నే అడిగి తెలుసుకో. ఈయన ఒక్క చింతైనా ఉందేమో చూడు! ఈయనని బండ తిట్లు తిట్టిచూడు ఇతనికి మనసులో ఏమైనా అశాంతి వుంటుందేమో!

**ప్రశ్నకర్త:** సరే కాని, చింత ఉండకుండా ఉండాలంటే నేను ఏం చెయ్యాలి?

**దాదాశ్రీ:** దానికోసం ఒక జ్ఞాని దగ్గరకు పోయి ఆయన కృపను పొందు. అప్పుడు చింత దూరమౌతుంది, ప్రపంచమంతా సవ్యంగా నడుస్తుంటుంది.

## చింతపోగానే సమాధి స్థితి

చింత పోయిందంటే అలజడి తగ్గినట్లే కదా! చింత అనేదే లేనప్పుడు, ఎలాంటి అలజడీ లేనప్పుడు, ఉపాధి అంటే, బయటి నుంచి కలిగే దుఖాలలో సమాధిలో ఉన్నప్పుడు నిజానికి సమస్యలన్నీ తొలగిపోయాయని తెలుసుకోండి.

**ప్రశ్నకర్త:** అలాంటి సమాధి స్థితిని తెచ్చుకుందామంటే రావటం లేదు.

**దాదాశ్రీ:** అది తెచ్చుకోగలిగేది కాదు. జ్ఞాని ఆ సమస్యలను పరిష్కరించినప్పుడు, సంపూర్ణంగా శుద్ధిచేసినప్పుడు, నిరంతర సమాధి సంప్రాప్తమౌతుంది. చింత అనేదే లేని జీవితం ఎంతో బావుంటుంది కదా!

**ప్రశ్నకర్త:** అది నిజంగా బావుందనే అంటారు కదా!

**దాదాశ్రీ:** మీ జీవితాన్ని చింతారహితం చేస్తాము. ఇక చింత అనేదేమీ నీకు ఉండదు. ఇది ఆశ్చర్యం కలిగించే విషయం కదా. ఈ రోజుల్లో కూడా అలా జరుగుతుందా అనిపిస్తోందా? కాని, చూడు జరిగింది కదా!

## నీవే పరమాత్మ అయినప్పుడు ఇక చింత ఎందుకు?

ఈ విషయాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. మీరే పరమాత్మ, భగవానుడు అయినప్పుడు మరి మీకు అలజడి దేనికి? దేనికి చింత? ఈ ప్రపంచం ఒక్క క్షణమాత్రమైనా చింతించదగ్గది కాదు. చింత నుంచి తప్పించుకోలేకపోతున్నారు. ఎందుకంటే, సహజంగా దాన్నుంచి తప్పించుకునే మార్గంలోనే మీరు అలజడులకు అంకురార్పణ చేసారు. ఇక ఇప్పుడు చింతించి ఏం లాభం? సమస్యలు వస్తే వాటిని ఎదుర్కోవాలి, వాటిని పరిష్కరించుకోవాలి.

**ప్రశ్నకర్త:** ఒకవేళ మనం ప్రతికూలతను ఎదుర్కుంటూ, దాన్ని అడ్డుకుంటూ, దానికి ప్రతిచర్య చేసుకుంటూపోతే అప్పుడు అహంకారం పెరిగిపోతుంది.

**దాదాశ్రీ:** చింతించేదానికంటే ఎదుర్కోవటమే మంచిది. చింత అనే అహంకారంతో పోలిస్తే, దాన్ని ఎదుర్కోవటంలో కలిగే అహంకారం చాల చిన్నది. భగవానుడు చెప్పినట్లు, "అటువంటి పరిస్థితులను ఎదుర్కో, తరుణోపాయమేమిటా అని ఆలోచించు కాని చింతపడవద్దు."

## చింతించేవారికి రెండు రకాల దండనలు

చింతపడేవానికి రెండు దండనలు, చింతపడనివారికి ఒకే దండన అంటాడు భగవానుడు. 18 సంవత్సరాల వయసులోని ఏకైక కుమారుడు చనిపోయాడంటే, ఎంత చింతించి, ఎంత

దుఃఖపడి, తల బాదుకుంటూ ఏడ్చి, అలాగే ఇంకా ఏం చేసినా, ఆ మనిషికి రెండు శిక్షలు పడతాయి. అలాంటివేమీ చెయ్యకపోతే ఒకే ఒక్క శిక్ష. కొడుకు మరణించాడు అంతవరకే ఆ దుఃఖం పరిమితం. అందుకు తన తలబాదుకుంటే అది అదనపు శిక్షే. అలా మనం రెండవ శిక్షను పొందగూడదు కనుక, నేను అందరికీ చెప్పేదేమిటంటే, జేబులోంచి ఐదువేల రూపాయలు పోయినట్లయితే, ''జరగవలసిందే జరిగింది- వ్యవస్థిత శక్తి అన్నట్లుగా తీసుకుని ముందుకుసాగాలి, ఏమీ జరగనట్లే ఇంటికెళ్ళిపోవాలి.

ఆ శిక్ష మనకు మనం వేసుకునేదే. అంటే, అలజడికి లోనవాల్సిన అవసరమే లేదు. అందుకే నేను 'జరగాల్సింది- వ్యవస్థిత' అని అన్నాను. నిజంగా అంతే. జరగాల్సిందే జరిగింది. జరిగిందేదో జరిగిపోయింది. ఏం జరిగినా అదే కరెక్ట్ అనుకోవాలి.

## ఏ పనిలోనైనా చింత మొదలైతే ఆ పని పాడవటమే జరుగుతుంది

ఏ పనైనా జరగకపోతే, నీ ప్రయత్నాన్ని నీవు చెయ్యి, దాన్ని తీవ్రతరం చెయ్యి కాని, దాని గురించి చింత అనవసరం అంటాడు భగవానుడు. చింతపడుతున్నట్లయితే ఆ పని మీద భారం పడుతుంది, అలా చింతించేవాడు దాని నియంత్రణను తన చేతుల్లోకి తీసుకున్నవాడవుతాడు. 'అంతా నేనే చేస్తున్నాను' అనుకుంటే కళ్ళెం తన చేతుల్లోకి తీసుకున్నట్లే అవుతుంది. అది అపరాధమే అవుతుంది.

దీని మీద అధికారం నాది అని అనుకుంటే దాని గురించిన చింత కూడా అధికమౌతుంది. విదేశాలలో సంపాదించిందంతా విదేశాలలోనే ఉండిపోతుంది. మోటార్లు బంగళాలు, భార్యా పిల్లలు, అంతా, అందరినీ ఇక్కడే వదిలేసి పోతాం. ఆ చివరి స్టేషన్లో ఎంతటి ఘనులైనా, వాళ్ళ మాటలేమీ చెల్లవు. కేవలం మీ పుణ్యం పాపాల మూటలను మాత్రం తీసుకునివెళ్ళనిస్తారు. మరోవిధంగా చెప్పాలంటే, ఇక్కడ ఏమేం పాపాలు చేసారో వాటి బాపతు శిక్షాస్మృతులు మాత్రం వెంటవస్తాయి. ఆ పాపంలో సంపాదించిన సొమ్ము మాత్రం ఇక్కడే మిగిలిపోతుంది, విచారణైతే జరుగుతుంది. ఆయా చట్టాలకు సంబంధించిన

సెక్షన్లకు అనుగుణంగా కొత్త శరీరాన్ని ఒకదాన్ని ధరించి, కొత్త విధానంలో సంపాదించి, ఆ అప్పులను తీర్చేకోవలసివుంటుంది. అందుకే బాబూ! ముందు నుంచే సక్రమంగా వ్యవహరించండి. స్వదేశం (ఆత్మ) లోనే సుఖంగా ఉంటారు. అయితే స్వదేశం ఎలా ఉంటోందో చూడనేలేదుగా.

## వసూళ్ళు గుర్తుకొస్తాయి అక్కడ...

ఇంట్లో అందరూ, "రాత్రి 11 గంటలయింది. ఇక పడుకోండి" అన్నప్పుడు మీరు దోమ తెరలోకి దూరి పడుకున్నారు. ఇంట్లో మిగతావాళ్ళంతా నిద్రల్లోకి పోయారు. దోమ తెర లోపలికి వెళ్ళిన తర్వాత మీకు గుర్తుకొస్తుంది, "ఒక మనిషి మూడువేల రూపాయల బిల్లు బాకీ ఉంది, గడువు అయిపోయింది. ఈ రోజు గనక సంతకం పెట్టించివుంటే గడువు లభించివుండేది." అయితే ఈ రోజు సంతకం పెట్టించలేదు, అది చింతకు కారణమౌతుంది. అంత రాత్రప్పుడు సంతకం పెట్టించటమైతే జరిగే పనా? కాదుకదా! మరి హాయిగా నిద్రపోవటానికేం?

## చింతకు మూలం

గుండెను రగిలించే మానసిక వ్యధ వలన ఏం లాభం? ఆరోగ్యాన్ని పాడుచేస్తుంది, మనకు లభించేవాటికి విఘ్నం కలిగిస్తుంది. చింత వలనే అటువంటి పరిస్థితి ఏర్పడుతుంది. విషయం మీద పూర్తిగా ఆలోచించండి కాని వ్యధచెందటం దేనికి? దాన్నే అహంకారం అని అన్నాను. అటువంటి అహంకారం ఉండగూడనిది. "నేను ఫలానా, నేనే అంతా చేస్తున్నాను" అని అనుకోవటం వలన, "నేను ఉంటేనే ఆ పని సవ్యంగా జరుగుతుంది" అనే భావన కలుగుతుంది, దానితో చింత ప్రారంభమౌతుంది. అందువలన, ఆపరేషన్ చేసి, అహంకారం అనే భాగాన్ని తొలగించివేయండి. అప్పుడు అందులో మీరు ఆలోచించే విషయాలు నమోదు కావు కనుక, ఆకారణంగా మీలో రక్తం మరగటం అనేది జరగదు. లేకపోతే చింత అనేది రక్తాన్ని, మనసుని కాల్చివేస్తుంటుంది. మనసులో చింత ఉన్న సమయంలో చిన్న పిల్లవాడు

ఏమైనా మాట్లాడదామని దగ్గరికి వస్తే, వాడి మీద కూడా కోపాన్ని ప్రదర్శించటం జరుగుతుంది. అంటే నష్టమనేది అన్ని రకాలుగా జరుగుతుంది. ఈ అహంకారం ఎలాంటిదంటే, డబ్బులుండనీ లేకపోనీ కాని, ఎవరైనా “ఈ చందూ నాకు ఎంతో నష్టం చేసాడు” అంటే, చింత, అలజడి హద్దులు దాటిపోతాయి. ప్రపంచంలో, మనమేం చెయ్యకపోయినా మనల్ని అంటారు కదా!

## చింత వలన కలిగే పరిణామమేమిటి?

ప్రపంచంలో మనం చేసే పనులలో మనకు అహంకారమనేది ఒక బైప్రోడక్ట్‌గా రావటం సహజం. దాన్ని ఉపయోగించి పనులను సాఫీగా చేసుకోవటానికి బదులు, అహంకారానికి పెద్దపీట వేసి, అహంకారాన్ని విస్తరింపజేసుకుంటున్నాం. అది ఎంత విస్తరించుకుంటున్నదంటే, ఇక చింతకి హద్దులనే చెరిపేసింది. సహజంగా ఉండే అహంకారంతో జీవనం సవ్యంగా సాగిపోతుంది కానీ, పెద్దాయన ఇంకా ఈ వయసులో కూడా, “నన్ను చింత బాధిస్తుంది” అని అంటూనేవుంటాడు. ఆ చింత ప్రభావం ఎలా ఉంటుంది? తర్వాత జంతు జన్మే ప్రాప్తమౌతుంది. అందుకే తస్మాత్ జాగ్రత్త. ఆ జాగ్రత్తేదో ఇప్పుడే పడగలం, మానవ జన్మలో ఉన్నప్పుడే. లేదంటే, చింతకు ఫలితం జంతు జన్మే.

## భక్తుడు భగవంతునితో కూడా జగడం పెట్టుకుంటాడు

నిజమైన దైవ భక్తునికి చింత అనేదెప్పుడైనా కలిగితే, అతను భగవంతుని కూడా ప్రశ్నిస్తాడు– ‘భగవంతుడా! వద్దు వద్దు అని నువ్వు చెప్తున్నా సరే నాకెందుకు ఇలా చింత కలుగుతూవుంది?” అని. భగవంతునితో దెబ్బలాడనివాడు అసలు నిజమైన భక్తుడే కాడు. ఏమైనా సమస్య ఎదురైతే, మీలోనే భగవంతుడు ఉన్నాడు కదా, ఆయన్ని నిలదీయండి. భగవంతునితో కూడా దెబ్బలాడేవాడే నిజంగా భక్తికలిగినవాడు అనిపించుకుంటాడు. ఈ కాలంలో నిజమైన భగవద్భక్తుడు కనిపించటం దుర్లభమే. అందరూ తమ తమ స్వార్థాలనే చూసుకుంటున్నారు.

శ్రీకృష్ణ భగవానుడు అలా అన్నాడు,

"జీవుడా నువ్వెందుకయ్యా ఆలోచిస్తావు? కృష్ణుడు తాను చెయ్యవలసింది చేస్తాడు"

అయితే అందుకు ఏమంటారో తెలుసా? కృష్ణుడు అలాగే అంటాడు కాని, చింత లేకుండా ప్రపంచం నడుస్తుందా? అని. మరి ఇక్కడ అహంకారాన్ని ఒక పెద్ద కార్ఖానా చేసేసారు, అందులో తయారయ్యే వస్తువులు అమ్ముడుబోవు కూడా. అవి ఎక్కడ అమ్ముడుపోతాయి? మీరు ఎక్కడికి, ఎవరిదగ్గరకు పోయి అమ్ముదామనుకున్నా, అక్కడ వాళ్ళల్లో కూడా ఒక కార్ఖానా పనిచేస్తుంటుంది కదా. మనసులో చింత అనేది లేని వాడిని ప్రపంచంలో ఒక్కడైనా దొరుకుతాడేమో వెతికిచూడు.

ఒక పక్క శ్రీకృష్ణా నీవే శరణు అని అంటుంటారు. నిజంగా శ్రీకృష్ణుని శరణు కోరినట్లయితే, చింత ఎందుకుంటుంది నీ మనసులో? మహావీర్ భగవానుడు కూడా చింతించటం వద్దని చెప్పాడు. ఒకసారైతే ఆయన చింతించటమనేదాని పర్యవసానం "తిర్యంచ గతి" అని అన్నాడు. చింత అనేది అన్నిటికన్నా అతి పెద్ద అహంకారం. "ఇదంతా నేనే చేస్తున్నాను" అని అనుకుంటాడే అప్పుడే చింత దాని ఫలస్వరూపంగా లభిస్తుంది.

## అందరూ చెప్పే మాట ఒకటే

చింత అంటే ఒక విషయం మీద ఆలోచించటం. ఈ శరీరం ఎన్ని సుఖదుఖాలను మోసుకువచ్చిందో వాటన్నిటినీ అనుభవించవలసిందే. అందువలన ఇతరులలో దోషాలను వెతక్కండి, వారిలోని లోపాల మీద దృష్టిపెట్టకండి. మన సొంత దోషాల ఫలితాలనే అనుభవించవలసివుంటుందని అర్థం చేసుకోండి. అందులో మీరు ఎటువంటి మార్పులూ చేయలేరు.

ఈ విషయంలో శ్రీకృష్ణ భగవానుడు, "ఓ జీవుడా నువ్వెందుకయ్యా ఆలోచనలలో పడతావు. కృష్ణుడు చేసేది చేస్తాడు" అన్నాడు. అందుకు జైనులు ఏమంటారంటే, "ఇది కృష్ణ భగవానుడు అన్నాడు కాని మహావీర్ భగవానుడు అలా చెప్పలేదు" అని. మహావీర్ భగవానుడు అన్నదేమిటంటే, "చింత, ఆలోచనలను వదిలిపెట్టు" అని. అయితే భగవానుడు చెప్పింది

వినేదెవరు గనక? మనం ఆయన మాటే విననప్పుడు ఆయనతో ఎలా దెబ్బలాడగలం? పరిశీలించవచ్చు. నాకు చెప్పినప్పుడు నేనైతే ఒప్పుకున్నాను. "ఔను నిజమే. కానీ ఇదొక్క మాటే అలా ఉన్నది" అనుకున్నాను. అందువలన నేను దాని రెండవ పార్శ్వాన్ని చూసాను. మహావీర్ భగవానుడు చెప్పిందే శ్రీకృష్ణ భగవానుడు కూడా చెప్పాడు. కనుక ఈ రెండు కలుస్తున్నాయి. అయినా ఎవరికైనా అది అర్థం కాకపోతే వాళ్ళు పరిశీలించవచ్చు.

సహజానంద స్వామి ఇలా అన్నారు, "మీ ప్రమేయం లేకుండా గడ్డిపోచ కూడా విరగదు" ఇది చూసి నేను అనుకున్నా, "ఆహా ఈ ముగ్గురి మాటలు ఎంతగానో కలుస్తున్నాయి కదా" అని. అయితే ఇంకా ఎన్ని కలుస్తాయో చూద్దామని అనుకున్నా.

కబీర్‌దాస్ ఏమన్నారో చూసాను, "ప్రారబ్ధం ముందు తయారైంది, ఆ తర్వాతనే శరీరం తయారైంది. కాని మనస్సు ప్రశాంతంగా ఉండదెప్పుడు". ఇలా అన్ని రకాలుగా సరిచూసుకుంటూ వెళ్ళాను, అందరినీ అడిగి తెలుసుకుంటూపోయాను, మీరు ఏమంటారు అంటూ.

ఒక వ్యక్తి తప్పు చెప్తారేమో కాని వీతరాగుల మాటలు ఎప్పుడూ తప్పు అవవు. వాటిని రాసినవాళ్ళు తప్పుగా రాసివుండవచ్చునేమోకాని, వీతరాగులైన సాధువుల మాటలు తప్పు అని నేను ఎప్పుడూ అనుకోను. నన్ను ఎవరైనా అటు తిప్పి, ఇటు తిప్పి అడిగినా సరే, అటువంటి సాధు సంత మహాత్ములు తప్పు మాట్లాడతారని నేను ఎప్పుడూ ఒప్పుకోలేదు. చిన్నప్పటి నుంచి, జన్మత వైష్ణవుడిని ఐనప్పటికీ, వాళ్ళ తప్పని నేను ఎప్పుడూ అనుకోలేదు. ఎందుకంటే వాళ్ళు మహాజ్ఞానులు కనుక. వాళ్ళను తలచుకుంటేనే మనకెంతో మంచి జరుగుతుంది. మరి మనం ఎలా ఉన్నామో చూడండి. ఒక ఆవగింజ కంటే ఎక్కువ ఏమీ లేము. అరె, ఒక ఆవ గింజను చూసారా మీరు అని అడిగితే, అదేమిటి, ఆవగింజను చూడకుండా ఉంటామా అంటారు. అంత తేడా కూడా రాదు మనలో చూడండి. మనవాళ్ళు సాధ్యమైనంత సేపు నడుం వాల్చకుండా మెలకువలోనే ఉంటారు. అందుకోసం శరీరాన్ని సాగదీసి మెలిబెట్టి ఉంచుతారు, గుండెపోటు తెచ్చుకునేందుకు సంసిద్ధమౌతుంటారు.

## ఈయన విలువ ఎవరికి?

ఒక ముసలాయన వచ్చి, నా కాళ్ళ మీద పడి పెద్దగా ఏడవటం మొదలుపెట్టాడు. "ఏమిటి నీకొచ్చిన కష్టం?" అని అడిగాను. అప్పుడు అతను, "నా నగల దొంగతనం జరిగింది. ఆచూకీ తెలియటం లేదు. అవి ఎప్పుడు దొరుకుతాయో!" అన్నాడు. ఇది విని నేను అతన్ని, "ఏమిటా నగలను నువ్వు వెంట తీసుకుపోతావా?" అని అడిగాను. "లేదు వెంట తీసుకుని అయితే పోలేను. కాని, దొంగిలించబడ్డ నా నగలు నాకు ఎప్పుడు దొరుకుతాయి?" అన్నాడతను మళ్ళీ. దానికి మళ్ళీ నేను అతనితో, "నువ్వు పోయిన తర్వాత అవి దొరుకుతాయి" అన్నాను. నగలు పోతే ఇంత ఆవేదనా, ఇంత మానసిక వ్యధా? అరె! పోయినదాని గురించి బాధపడి లాభమేమిటి? గతించినదాని గురించి చింతించటం ఎందుకు? జరగవలసినదాని గురించి ఆలోచిస్తే మంచిది కదా! ఆలోచించే శక్తివున్న మనిషికి చింత అనేది ఉంటుందన్న విషయాన్ని నేను ఒప్పుకుంటాను కానీ, చెయిజారిపోయినదాని గురించి కూడా చింతపడటమెందుకు? మన దేశంలో ఇలా చింతించటమనేది జరుగుతూనేవుంటుంది. ఒక క్షణం క్రితం జరిగిన దాని గురించి చింత ఎందుకు? తరుణోపాయం లేనప్పుడు దాని గురించి చింతించటం మానెయ్యాలన్నది బుద్ధిగలవాడెవడైనా అర్థం చేసుకోగలుగుతాడు.

ఆ పెద్దాయన ఇంకా ఏడుస్తూనేవున్నాడు. కాని రెండు నిమిషాలలో అతన్ని నేను మార్చివేసాను. అతనప్పుడు "దాదా భగవాన్ కె అసీమ్ జయ్ జయ్‌కార్ హెూ" (దాదా భగవాన్‌కి అంతులేని జయం కలుగుగాక) అన్నాడు. ఆయన మళ్ళీ ఉదయం "రణఛోడ్‌జీ" మందిరంలో కనిపించాడు. "దాదా భగవాన్!" అన్నాడు. "ఔనౌను అతనే" అన్నాను. అతను మళ్ళీ, "రాత్రంతా మీ నామ జపం చేస్తూనేవున్నాను" అన్నాడు. అతను ఎటు తిప్పితే అటే తిరుగుతాడులే కాని, అతనిలో అటువంటిదేమీ లేదు.

**ప్రశ్నకర్త:** అతనికి మీరేం చెప్పారు?

**దాదాశ్రీ:** నేను అతనితో, "అవే నగలు తిరిగి దొరికే అవకాశం లేదు కానీ, వేరే రకం నగలైతే దొరుకుతాయి" అన్నాను.

**ప్రశ్నకర్త:** మీరే అతనికి దొరికారు అంటే, పెద్ద నగే దొరికినట్లే కదా!

**దాదాశ్రీ:** ఔను. ఆశ్చర్యం ఏమిటంటే, ఈ విషయం అతనికి ఎలా అర్థమైందా అని. అతనికి తన నగల విలువతో పోలిస్తే దీని విలువ ఏమీ లేదు కదా! అతనికి టీ తాగవలసివుంటే, "నేనున్నాగా ఇక నీకు టీ ఎందుకు?" అంటే, "నాకు టీ తాగితేనే తృప్తి. మీరున్నా లేకపోయినా సరే" అంటాడతను. దీని విలువ ఎవరికి? ఎవరికి ఇష్టమో వాళ్ళకి!

## అతిథిగా వచ్చినవాడి దర్జా చూడు

ఈ ప్రపంచంలో అమూల్యమైనదానికి కూడా మూల్యమేమీ ఉండదు. అంటే, అన్నిటికన్నా విలువైనది కూడా ఉచితంగా లభించేదే. దాని మీద ప్రభుత్వ శుంకం ఏమీ ఉండదు. అన్నిటికన్నా ఎక్కువ విలువైన వస్తువులు ఏమిటి?

**ప్రశ్నకర్త:** గాలి, నీరు.

**దాదాశ్రీ:** గాలి సరే కాని నీరు కాదు. గాలి మీద ప్రభుత్వం ఎటువంటి పన్ను వేయదు. ఎక్కడబడితే అక్కడ లభిస్తుంది. మీరు ఎక్కడికి పోతే అక్కడ ఎనీ వేర్, ఎనీ ప్లేస్, మీకు అక్కడ గాలి లభిస్తుంది. ప్రకృతి మీకు ఎటువంటి సదుపాయం చేసిందో చూడండి! మీరు ఆ ప్రకృతిలోకి అతిథిగా వచ్చారు. అతిథి అయ్యుండి ఇక్కడ పెద్ద రాద్ధాంతం చేస్తారు, చింతిస్తుంటారు. అందువలన ప్రకృతికి, అరె, ఇతను అతిథిగా వచ్చాడు, గెస్ట్ ఎలా ఉండాలో తెలియదు అనిపిస్తుంది. అతిథి వంట గదికి పోయి, "పులుసులో కాస్త ఉప్పు ఎక్కువగా వెయ్యండి" అంటాడా. అతిథి అసలు వంటగదిలోకి దూరతాడా? ఎలా వడ్డిస్తే అలా తినాలి కదా! అతిథి అయ్యుండి వంటగదిలోకి పోతాడా? అమూల్యమైన గాలి కూడా మనకి ఉచితంగానే లభిస్తుంది. దాని తర్వాత వచ్చేది నీరు. ఎందుకంటే నీళ్ళకి కాస్తో కూస్తో చెల్లించవలసివుంటుంది కనుక. ఆ తర్వాత మూడవ స్థానం తిండిగింజలది. వాటికి కొద్దిగా చెల్లించటం అవసరమౌతుంది.

**ప్రశ్నకర్త:** వెలుగు.

**దాదాశ్రీ:** వెలుగు ఎలాగూ వుంది. సూర్యనారాయణుడు మీకు ఆ సేవలను అందిస్తున్నాడు. తెల్లవారి ఆరున్నర గంటలయేటప్పటికల్లా వచ్చి హాజరవుతుంటాడు.

## నమ్మకమనేది ఎక్కడా లేకుండా పోయింది

మన భారతదేశంలో ప్రజలు చింతాక్రాంతులు ఎలా అవుతారో చూడండి– సూర్యనారాయణుడు ఒకవేళ ఒకరోజు సెలవు కావాలని కోరుతూ, ఈ ఒక్కసారికే, మళ్ళీ ఎప్పుడు సెలవు తీసుకోను అని చెప్పినా, రెండవరోజు నిజంగా వస్తాడో లేదో అన్న శంక పీడిస్తుంటుంది. ఉదయం అవుతుందో లేదో. అంటే ప్రకృతి మీద కూడా మనకి నమ్మకం లేదన్నమాట. మీ మీద మీకు కూడా నమ్మకం లేదు, భగవంతుని మీద కూడా నమ్మకం లేదు. దేనిమీదా నమ్మకం లేదు. సొంత భార్య మీద కూడా నమ్మకం ఉండదు.

## స్వయంగా ఆహ్వానించిన చింత

చింతించటం కూడా పక్కవాడిని చూసి! పక్కవాడికి కారుంది, నాకు లేదు. జీవనం సాగించేందుకు ఎంత కావాలి? నాకు ఇంతింత అవసరం పడుతుంది, అని ఒక్కసారి నిర్ణయించుకో. ఉదాహరణకు ఇంట్లో అన్నపానీయాలకు సరిపడా, నివాసముండటానికి ఒక ఇల్లు, ఆ ఇంటిని నడపటానికి అవసరమైన డబ్బు ఉండాలి అన్నవి! ఆమాత్రం నీకు దొరుకుతుంది. కానీ, పక్కింటివాడి బ్యాంక్ ఖాతాలో పదివేల రూపాయల నిల్వ ఉంటే నీవది సహించలేవు. దానితో దుఖం ఉత్పన్నమౌతుంది. ఆ దుఖాన్ని ఆహ్వానించి తెచ్చుకున్నది నీవే!

## అహంకారమే జీవనాధారం

వ్యాకులం చెందటమనేది ఎలా ఉంటుందంటే, డబ్బులు ఎక్కువ వచ్చినా వేదన చెందుతారు, చింతాక్రాంతులౌతారు. ఈ అహమ్మదాబాద్‌లోని మిల్లు యజమానుల సంగతి మీకు చెప్తే, “భగవంతుడా! అటువంటి పరిస్థితి ఎవరికీ ఒక్కరోజు కూడా కలగకూడదు” అంటారు మీరు. రోజంతా కొలిమిలో పెట్టిన చిలకడదుంపలాగా ఉడుకుతుంటారు. వాళ్ళు దేనికోసం జీవిస్తున్నారు? “దేనికోసం వాళ్ళు జీవిస్తున్నారు?” అని వాళ్ళని అడిగితే, “ఏమో

మాకే తెలియదు” అంటారు వాళ్ళు. “నేను చెప్పనా, అందరికంటే నేనే పెద్ద కదా! అని మీరు అనుకుంటారు. దానివలనే మీరు జీవిస్తున్నారు. లేకపోతే ఇందులో ఏ సుఖమూ మీకు లభించదు.

## మీకు లభించనిదాని గురించి చింతించవద్దు

కొందరు అహమ్మదాబాదు సేఠ్‌లు కలిసారు. భోజనం సమయానికి మిల్లుకి వచ్చారు కనుక నాతోపాటు భోజనానికి కూర్చున్నారు. అప్పుడు సేఠాని (సేఠ్ భార్య) అతని ఎదురుగా వచ్చి కూర్చుంది. అప్పుడు నేను అడిగాను ఆమెను, “ఎందుకమ్మా సేఠాని అలా ఎదురుగా కూర్చున్నావు?” అని. అందుకామె, “సేఠ్‌గారు ఎప్పుడూ తిండి సరిగ్గా తినరు!” అన్నది. దానితో నాకు అర్థమైంది. ఈ సంగతే సేఠ్‌ని అడిగితే ఆయన, “నా మనస్సంతా అక్కడికే పోతుంటుంది.” అన్నాడు. అప్పుడు నేనన్నాను, “అలా చెయ్యవద్దు. ప్రస్తుతం మీ ముందుకు భోజన పళ్ళెం వచ్చింది. ముందు దాని సంగతి చూడాలి. అంటే, నీకు లభించినదాన్ని అనుభవించు. లభించనిదాని గురించి చింతించకు. వర్తమానకాలంలో ఉంటూ అక్కడ ఉ న్నదాన్ని పూర్తిగా అనుభవించు.”

చింత కలిగితే భోజనానికి వంటగదికి వెళ్ళవలసివస్తుందా? పడుకోవటానికి బెడ్‌రూమ్‌కి వెళ్ళవలసివస్తుందా? ఇక ఆఫీసుకేమో పనిచేయటానికి!

**ప్రశ్నకర్త:** అక్కడికి కూడా పోతుంటారు.

**దాదాశ్రీ:** అవన్నీ డిపార్ట్‌మెంట్లు. ఒక డిపార్ట్‌మెంటులోని సమస్యలను మరో డిపార్ట్‌మెంటులోకి తీసికెళ్ళవద్దు. ఒక శాఖలోకి వచ్చినప్పుడు అక్కడ చేయాల్సిన పనినంతా పూర్తిగా చెయ్యి. కాని, వేరే డిపార్ట్‌మెంటులోకి భోజనం చేయటానికి పోయినప్పుడు అంతకు ముందు డిపార్ట్‌మెంటులోని సమస్యలను వెంట తీసుకునిపోవద్దు, అక్కడే వదిలిపెట్టేయాలి. భోజనానికి కూర్చున్నప్పుడు దాని రుచిని ఆస్వాదిస్తూ తినాలి. అలాగే బెడ్‌రూమ్‌లోకి పోయినప్పుడు అంతకు ముందున్న సమస్యలను వెంట తీసుకుపోవద్దు, అక్కడే వదిలేసి పోవాలి. ఇలాంటి

ఏర్పాటు లేకపోతే, ఆ మనిషి దెబ్బతింటాడు. భోజనానికి కూర్చున్నప్పుడు, "ఆఫీసులో అయ్యగారు కోప్పడతాడేమో అప్పుడు ఏం చేయను?" అనే చింత కలిగితే, కోప్పడితే అప్పటి సంగతి అప్పుడు చూసుకోవచ్చు. ఇప్పుడైతే ముందున్నది తినరాదు హాయిగా!

భగవానుడు అలాగే చెప్పాడు– "నీకు ప్రాప్తించినదాన్ని అనుభవించు, అప్రాప్తానికి చింతించకు" అని. అంటే లభించనిదాన్ని అనుభవించు అని అర్థం.

## ఎయిర్‌కండిషన్‌లో కూడా చింతే

**ప్రశ్నకర్త:** మెదడులో ఇంకా ఎన్నో చింతలుంటాయి కదా!

**దాదాశ్రీ:** అన్నం తింటున్నప్పుడూ చింత కలుగుతూనేవుంటుంది అంటే పైన గంట వేలాడుతూవుంది, "అది ఎప్పుడు మీద పడుతుందో ఎప్పుడు మీద పడుతుందో, ఎప్పుడు మీద పడుతుందో" అని దాని మీదనే ధ్యాస ఉన్నట్లు. ఇప్పుడు చెప్పు. అటువంటి భయోత్పాదనలో కూడా ఇవన్నీ అనుభవించాలా, అదంతా ఎలా సాధ్యమౌతుంది? అయినా జనమంతా సిగ్గులేకుండా అన్నీ అనుభవిస్తూనేవున్నారు. ఏం జరిగితే అది జరుగుతుందిలే కాని ఇప్పుడు అనుభవించు. అసలీ ప్రపంచం అనుభవించే యోగ్యత కలిగింది అంటూ ఏమైనా ఉందా?

విదేశాలలో అంతా అట్లా జరగదు. ఏ దేశంలోను అట్లా జరగదు. ఇదంతా ఇక్కడే జరుగుతుంది. జ్ఞానభండారాలు కదా, బుద్ధికూడా టోకునే (హోల్‌సేల్‌లో), చింత కూడా టోకునే కలుగుతుంది. ఒక ఫ్యాక్టరీ నడుపుతున్నట్లే చేస్తారందరూ. పెద్ద పెద్ద కార్ఖానాలలో పెద్ద పెద్ద పంఖాలు తిరుగుతుంటాయి, వేరే అన్నీ కూడా తిరుగుతూనేవుంటాయి. చింతన, పరిష్కారమార్గాల మీద యోజనలు కూడా జరుగుతుంటాయి. మరి చల్లబరుస్తుంటుందే, దాన్ని ఏమంటారు?

**ప్రశ్నకర్త:** ఎయిర్ కండిషనర్.

**దాదాశ్రీ:** ఆ. ఎయిర్‌కండిషనర్! భారతదేశంలో ఆశ్చర్యమైన విషయమే కదా!

**ప్రశ్నకర్త:** ఇప్పుడు అన్ని చింతనలూ ఎయిర్‌కండిషన్‌లోనే జరుగుతున్నాయి.

**దాదాశ్రీ:** అంటే, అవి రెండూ పక్కపక్కనే నడుస్తున్నాయి. చింతలతోపాటు శీతలీకరణ వ్యవస్థ. మనందరికీ ఎయిర్‌కండిషన్ అవసరం లేదు.

అమెరికా ఆడపిల్లలు వెళ్ళిపోతే, దానికి వాళ్ళు పెద్దగా చింతించరు కానీ, మనవాళ్ళు? ఎవరి పద్ధతులు వాళ్ళకుంటాయి!

## వయోపరిమితిని పెంచుకోలేదా?

మీరు ఈ భూమ్మీద రెండువందల ఒక్క సంవత్సరాలు జీవిస్తారా? ఎక్స్‌టెన్షన్ తీసుకోలేదా ఇంకా?

**ప్రశ్నకర్త:** ఎక్స్‌టెన్షన్ దొరుకుతుందా ఎలా? మన చేతిలో ఏమీ లేదుగా! నాకైతే అలా అనిపించటం లేదు.

**దాదాశ్రీ:** ఏం మాట్లాడుతున్నావు బాబూ! జీవించటం మన చేతుల్లో ఉంటే ఇక మరణించటం కూడా ఉండదు. మనల్ని బలవంతంగా తీసుకెళ్ళిపోతున్నారు. జీవితానికి ఎక్స్‌టెన్షన్ లేనప్పుడు మరి ఎందుకు చింతిస్తున్నావు? నీకు లభించినదాన్ని హాయిగా అనుభవించరాదూ?

## చింతలను కొనితెచ్చికోవటం మానవ సహజ స్వభావం

చింతించటం వలన నిజానికి పనులింకా చెడిపోతాయి. చింతలు పనిని 100 శాతానికి బదులు 70 శాతమే అయ్యేటట్లుగా చేస్తాయి. పనిలో అవరోధాలను కలిగిస్తాయి. చింతలే లేకపోతే పరిణామం ఎంతో చక్కగా ఉంటుంది.

మనెప్పటికైనా చనిపోవలసిందే అన్న సంగతి అందరికీ తెలుసు. అయినా మృత్యువు గుర్తుకొస్తే ఏం చేస్తారు? మరణం గుర్తుకొచ్చినప్పుడు మనం ఏం చేస్తాం? దాన్ని పక్కకు నెట్టేస్తాం. 'నాకేమైనా జరిగితే?' అన్న ఆలోచన రాగానే దాన్ని మనం పక్కకు తోసేస్తాం.

అలాగే మనసులో చింత మొదలైనప్పుడు, "నీకిక్కడ చోటులేదురా భయ్" అంటూ దాన్ని తోసిపడేయండి.

చింతల వలన అన్ని పనులూ చెడిపోతాయి. వాహనం నడిపేటప్పుడు చింతకు లోనైతే దేనికో గుద్దేస్తావు. వ్యాపార వ్యవహారాలలో మరేదో చింతలో ఉంటే అక్కడ వ్యవహారం కాస్తా చెడిపోతుంది. ప్రపంచంలో అన్నీ చింతల వలనే చెడిపోయిన ఉదంతాలున్నాయి.

ఈ ప్రపంచం అసలు చింతించ యోగ్యమైనది కానేకాదు. ఈ ప్రపంచంలో చింతించమంటే మూర్ఖత్వంలో పరాకాష్టతే అవుతుంది. చింతించేందుకు కాదు ఉన్నదీ ప్రపంచం. ఇదే ఒక కల్పన. ఇది భగవంతుని కల్పన కాదు. కనుక ఇది చింతించే యాగ్యత కలిగింది కాదు. ప్రాణులలో చింత కలిగేది ఒక్క మనుషులకే. మిగతా ప్రాణులేవీ చింతించటం ఎరుగవు. ఇంకా ఎనభైనాలుగ లక్షల జీవరాశులున్నాయి కానీ, అవేవీ చింతించే పని పెట్టుకోలేదు. మనిషి అనే జీవి అవసరాన్ని మించిన తెలివితేటలున్నవాడు కనుక రోజంతా చింతలతో దహించుకుపోతుంటాడు.

చింత అనేది స్వచ్ఛమైన అహంకారం. ఏ జంతువుకూ లేని చింత మనిషికే ఎందుకు. అబ్బ ఎన్ని రకాల జంతువులున్నాయి! దేనికీ చింత అనేదే లేదు. మనిషి మాత్రమే జడపదార్థంలా రోజంతా కాలుతూనేవుంటాడు చింతలతో.

**ప్రశ్నకర్త:** జంతువుకంటే కూడా అధములు కదా వీళ్ళు!

**దాదాశ్రీ:** జంతువులు చాల నయం. భగవంతుడు జంతువులనైతే ఆశ్రయులు అన్నాడు. మనుషులు మాత్రం నిరాశ్రయులు. అందులో భారతదేశవాసులు నూటికి నూరు శాతం నిరాశ్రయులు కనుక మరి వాళ్ళిక దుఃఖంలోనే కదా ఉంటారు! ఏ ఆసరా లేని వాళ్ళు కదా!

కాయకష్టం చేసేవాళ్ళకి ఎటువంటి చింతా లేదు కాని వాళ్ళ సేరుకి మాత్రం చింత ఉంటుంది. కాయకష్టం చేసేవాళ్ళది ఉచ్ఛగతి కాబట్టి వాళ్ళకి చింత అనేదేమీ ఉండదు.

సేరులది అధోగతి కాబట్టి వాళ్ళకి చింత ఉంటుంది. చింతించటం వలన కలిగేది అధోగతే. కాబట్టి చింత ఉండగూడదు.

వత్తిడి, వత్తిడి, వత్తిడి– చిలకడదుంప మగ్గుతున్నట్లుగానే ఈ జగత్తంతా మగ్గుతూవుంది. నూనెలో చేపలు వేగుతున్నట్లు, కొట్టుమిట్టాడుతుంటారు. దీన్ని జీవించటం అంటారా?

## నేను చేస్తున్నాను అనే ఆలోచనతోనే చింత అంతా

**ప్రశ్నకర్త:** చింత ఉండకూడదు అనేది కూడా మరో చింత అవుతుందేమో?

**దాదాశ్రీ:** కాదు. చింత అహంకారం. కేవలం అహంకారం. తన స్వస్వరూపాన్ని మరిచి అహంకారంతో "అంతా నేనే నడుపుతున్నాను" అనుకుంటారు. మరుగుదొడ్డికి పోయే శక్తే లేదు కాని, "నేనే అంతా చేస్తున్నాను" అంటారు.

చింత అహంకారంతోనే కలుగుతుంది. ఈ పిల్లవాడికి ఎందుకు ఉండదు చింత? ఎందుకంటే వాడికి తెలుసు తను ఏమీ నడపటంలేదని. ఎవరు నడుపుతున్నారంతా అనే విషయం తనకి అనవసరంగానే భావిస్తాడు.

"నేను చేస్తున్నా, నేనే చేస్తున్నా" అని అనుకోవటం వలనే చింత కలుగుతుంది.

## చింతించటమే అతి పెద్ద అహంకారం

**ప్రశ్నకర్త:** చింత అహంకారానికి సంకేతమా? కొద్దిగా వివరిస్తారా?

**దాదాశ్రీ:** చింత అనేది అహంకారాని సంకేతమని ఎందుకంటామంటే, ఆ మనిషి తన మనస్సులో "ఈ పనిని నేనే చేస్తున్నాను" అని అనుకుంటూవుంటాడు. దానివలనే అతనికి చింత కలుగుతుంది. "ఇదంతా నేనే నడిపిస్తున్నాను" అని భావిస్తూ, తనంతటతానుగా ఆ చింతను తన నెత్తిమీద వేసుకుని మథనపడుతుంటాడు, "నా కూతురికి ఎలా ఉంటుందో, నా కొడుకుకి విషయంలో ఎలా జరుగుతుందో, ఈ పని పూర్తికాక పోతే నా పరిస్థితి ఏమిటి?"

అనుకుంటూ. కర్తృత్వాన్ని ఆపాదించుకుంటూ, “నేనే యజమానిని, నేనే ఇదంతా చేస్తున్నాను” అనుకుంటూవుంటాడు. కానీ, అతను యజమాని కానేకాడు, అనవసరంగా చింతను తన తలకెక్కించుకుంటున్నాడు.

జన్మనెత్తి చింతలతోనే జీవితాన్ని గడిపుతూ, ఆ చింతలన్నీ సమసిపోకుండావుంటే, ఆ మనిషి ఇంకెన్ని జన్మలెత్తవలసివుంటుందో! ఎందుకంటే చింత (కర్మ) తోనే మరుజన్మ ఏర్పడుతుంది.

ఒక చిన్న విషయం చెప్తాను మీకు. చాలా సూక్ష్మమైనది. ఈ ప్రపంచంలో ఏ మనిషికైనా తనంతట తానుగా విరోచనం చేసుకునే శక్తి కూడా లేదు. అలాంటప్పుడు వీళ్ళంతా అహంకారంతో జీవించటంలో అర్థమేమిటి? మరో శక్తి పనిచేస్తూవుంది. ఆ శక్తి మనది కాదు. అది పరశక్తి. స్వశక్తి ఏమిటో కూడా తెలియదు. అందుకే పరశక్తి ఆధీనంలో ఉ ంటారు. అది పరాధీనం కూడా అవుతుంది. జన్మంతా పరాధీనంలో గడుస్తుంది.

## కూతురు పెళ్ళి గురించి చింత

మన దేశంలో పరిస్థితి ఏమిటంటే, కూతురు 3 సంవత్సరాల వయసుకి వస్తూనే, “అమ్మాయి పెద్దదవుతోంది, అమ్మాయి పెద్దదవుతోంది” అని ఆలోచిస్తుంటారు. పెళ్ళి చేసేది 20 సంవత్సరాల వయసులో అయితే చింత మాత్రం ఆ అమ్మాయి చిన్నప్పటి నుంచే మొదలౌతుంది. అమ్మాయి పెళ్ళి గురించి ఎప్పటి నుంచి మనోవ్యథకి గురవ్వాలి అని ఏదైనా శాస్త్రంలో రాసివుందా? 20 సంవత్సరాల వయసు వచ్చిన తర్వాత పెళ్ళి చేయాలి అంటే ఆ విషయంలో ఎప్పటి నుంచి ఆలోచించాలి? రెండు మూడు సంవత్సరాల వయసు వచ్చినప్పటి నుంచేనా?

**ప్రశ్నకర్త:** కూతురు పధ్నాలుగు, పదిహేను సంవత్సరాల వయసుకి వచ్చేసరికి తల్లిదండ్రులకు ఆ ఆలోచన వస్తుంది కదా!

**దాదాశ్రీ:** ఎందుకు, అప్పటికీ ఐదు సంవత్సరాలుంది కదా! ఆ ఐదు సంవత్సరాలలో ఆ పెళ్ళిగురించి చింతపడుతున్నవాళ్ళు చనిపోరు, ఎవరి కోసమైతే చింతపడుతున్నాడో ఆమె చనిపోదు అని ఎవరికైనా కచ్చితంగా తెలుసా? ఇంకా ఐదు సంవత్సరాలు ఉండగా, ఆ విషయంలో ఇప్పటి నుంచే ఎందుకు చింత?

అది కూడా ఎవరినో చూసి, “ఫలానా మనిషిని చూడు కూతురి పెళ్ళి కోసం ఎంత చింతిస్తున్నాడో. నాకేమో అసలు ఆ చింతే లేదు” అని చింతలో చింతపెట్టుకుని పుచ్చకాయలా నలిగి గుజ్జుగుజ్జు అవుతాడు. చివరకు అమ్మాయి పెళ్ళిచేసే సమయం వచ్చేసరికి చేతిలో నాలుగు అణాలు కూడా ఉండవు. చింతించేవాడు రూపాయలు ఎక్కడి నుండి తెస్తాడు?

మీరు చింతించవలసింది ఎప్పుడు? చుట్టుపక్కలవాళ్ళు, “కూతురి పెళ్ళి విషయంలో ఏమైనా చూస్తున్నారా?” అని అడిగినప్పుడు, ఇప్పుడు ఇక దాని గురించి ఆలోచించవలసిన సమయం వచ్చింది అని అనుకోవాలి, ఆ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టాలి. చుట్టుపక్కలవాళు ్ళ ఏమీ అనకుండానే, పదిహేను సంవత్సరాల ముందు నుంచే చింత పట్టుకుంటుంది. అంతేనా, భార్యతో కూడా, “మన కూతురు పెద్దవుతోంది, ఆమెకు పెళ్ళిచేయాలన్నది నీకు గుర్తుందా?” అని అంటాడు. అరె, భార్యను కూడా చింతలో పడేస్తున్నావెందుకు?

## అప్రస్తుత చింత

పదిహేడు సంవత్సరాల ముందు నుంచే కూతురు పెళ్ళి గురించి చింత పడుతున్నవాడు తన మరణం గురించి ఎందుకు చింతించడు? ఆ మాట అడిగిదే, “చనిపోవటమనే మాట ఎత్తకండి” అంటాడు. అప్పుడు, “అదేమిటి? మరణం గురించి ఆలోచిస్తే తప్పేమిటి? నువ్వు చచ్చిపోవా ఏమిటి?” అని అడిగాను. దానికతను, “మరణం గురించి గుర్తుచేస్తే నాకు ప్రస్తుతమున్న సంతోషం ఎగిరిపోతుంది, ఇప్పుడున్న సరదా అంతా ఇగిరిపోతుంది” అన్నాడు. “అయితే మరి కూతురి పెళ్ళి ఎందుకు గుర్తుచేసుకుంటున్నావు? అలా చేసినా నీ ప్రస్తుతమున్న సంతోషం పోదా? మీ అమ్మాయి పెళ్ళి కోసం అన్ని ఏర్పాట్లు చేసుకునే జన్మనెత్తింది. తల్లిదండ్రులు కేవలం నిమిత్తమాత్రులే” కూతురు తన పెళ్ళికి కావలసినవాటినన్నిటినీ, వెంటతెచ్చుకుంది. బ్యాంక్ బ్యాలెన్స్, డబ్బు, అంతా తీసుకునేవచ్చింది. తక్కువ ఖర్చు అవుతుందో, ఎక్కువ ఖర్చు అవుతుందో ఆ మొత్తాన్ని లెక్క ప్రకారం తీసుకునేవచ్చింది.

కూతురి గురించి మీరు చింతించవలసిన అవసరం లేదు. మీరు మీ కూతురు సంరక్షులే అంతే. మీ కూతురు తనకోసం పెళ్ళికొడుకుని కూడా తెచ్చుకునేవుంటుంది. మనం

వెళ్ళి ఎవరికీ, "మీరు అబ్బాయిని కనండి. నాకు కూతురు పుట్టింది కదా ఆమె కోసం అబ్బాయికి జన్మనివ్వండి" అని చెప్పనక్కర్లేదు. అట్లా చెప్పాల్సివస్తుందా ఏమిటి? అంటే చేయవలసిన ఏర్పాట్లన్నీ చేసుకునే వచ్చిందన్నమాట! అప్పుడు తండ్రి అంటాడు, "ఇది చూస్తే ఇరవైఐదు సంవత్సరాల ప్రాయంలోకి వచ్చింది. ఇప్పటి వరకు సంబంధాలేమీ కుదరలేదు వగైరా వగైరా" రోజంతా అదే పాట పాడుతుంటాడు. "బాబూ, అక్కడ అబ్బాయికి ఇరవై ఏడు సంవత్సరాలు వచ్చివున్నాయి. నీకు దొరకలేదు అంతే. దాని కోసం ఎందుకు గగ్గోలు పెడతావు? అరవకుండా పడుకో. మీ కూతురు తన టైమింగ్‌ని కూడా సెట్ చేసుకునే వచ్చింది."

మీ స్వాధీనంలో లేని దాని గురించి ఊహాగానాలు వద్దు. పూర్వ జన్మలో ఇద్దరు ముగ్గురు ఆడపిల్లలు, ఒక మగ పిల్లవాడు బాల్యంలో ఉన్నప్పుడే వదిలేసి వచ్చేసావే అనుకో. వాళ్ళందరి గురించి ఇప్పుడు చింతిస్తావా? ఎందుకని? చనిపోయేటప్పుడు చాల చింత కలిగివుంటుంది కదా, "చిన్న పిల్ల ఎలా బ్రతుకుతుందో" అని! కాని, ఇక్కడ మరో జన్మ ఎత్తగానే, పూర్వ జన్మ గురించిన చింతే ఉండదు. ఉత్తరం ముక్క కూడా రాదు. అర్థమేమిటంటే, ఇదంతా నీ ఆధీనంలో లేని విషయాలు కనుక, వాటిలో చెయిదూర్చవద్దు. అంటే, "వ్యవస్థిత రూపంలో జరగవలసింది జరుగుతుంది, జరగనిది జరగదు."

## చింతలో పడే బదులు ఆధ్యాత్మికం వైపు తిరుగు

**ప్రశ్నకర్త:** కుటుంబంలో యజమాని, ముఖ్యమైన వ్యక్తి, కర్త ఉంటాడు. అతనికి చింత అనేది ఉంటుంది. దాన్ని లేకుండా ఎలా చేయగలం?

**దాదాశ్రీ:** శ్రీకృష్ణుడు ఏమన్నాడు? "జీవుడా నీవెందుకయ్యా ఆలోచిస్తావు? కృష్ణుడు చేసేది చేస్తాడు కదా" అన్నాడని చదువుకున్నాం కదా! మరి చింత పెట్టుకుని ఏం లాభం?

పిల్లల విషయంలో మనఃక్లేశం ఎందుకు? వాళ్ళని ఆధ్యాత్మికం వైపు మళ్ళించిచూడు. అన్నీ అవే చక్కబడతాయి.

కొందరు తమ వ్యాపారాల విషయంలో ఆదుర్దా చెందుతుంటారు. వాళ్ళలా మథనపడటానికి కారణం ఏమిటి? వాళ్ళు మనసులో 'ఇదంతా నేనే నడుపుతున్నాను" అని

అనుకోవటమే. అందుకే వాళ్ళకి దాని గురించి చింత. “వాటిని నడుపుతున్నవాడు ఎవరు?” సాధారణంగా అతని మీద ఆధారపడివుండరు. మీ జ్ఞానంలో అది మీకు తెలియకపోవచ్చు కాని, ఎవరో ఒకరి మీద ఆధారపడాలి కదా! అన్నీ నీవైతే నడపటం లేదు అన్న విషయం కొద్దో గొప్పో అనుభవంలోకి వచ్చేవుంటుంది. చింత పెద్ద అహంకారం.

## ఎక్కువగా చింతించేవారు ఎవరు?

**ప్రశ్నకర్త:** రెండు పూటలా తిండి కూడా సరిగ్గా లేనివాడికి, “రేపు ఎలా గడుస్తుంది? ఏం తింటాం?” అన్న చింత ఉంటుంది కదా

**దాదాశ్రీ:** లేదు లేదు అలా జరగదు. ఎక్కువ ఉన్నప్పుడే చింత ఉంటుంది, సర్‌ప్లస్ చింత. తిండి విషయంలో ఎవరికీ చింత ఉండదు. కావలసినదానికంటే ఎక్కువ ఉన్నప్పుడే చింత కూడా ఉంటుంది. ప్రకృతిలోని వ్యవస్థ ఎలా ఉంటుందంటే, చిన్న మొక్కయినా ఎక్కడ మొలకెత్తినా సరే, అక్కడికెళ్ళి దానికి నీళ్ళుపోసి వస్తుంది. ప్రకృతిలో వ్యవస్థ అలాంటిది. “రెగ్యులేటర్ ఆఫ్ ద వర్ల్డ్”– ప్రపంచాన్ని నిర్వహణా కార్యాన్ని చూసే వ్యవస్థ ఇది. అది ఎల్లప్పుడూ సృష్టినంతటినీ రెగ్యులేట్ చేస్తుంటుంది. ఇది ఒట్టిగా చెప్తున్న మాట కాదు, “అధికంగా ఉన్నప్పుడే చింత ఉంటుంది కాని, తిండి విషయంలో చింత అతనికి ఉండదు.”

**ప్రశ్నకర్త:** మీకందరూ చింతల్లో ఉన్న సర్‌ప్లస్‌గలవాళ్ళే తటస్తపడ్డారేమో! డెఫిషిట్ (లేమి) లో ఉన్నవాళ్ళు మీకు ఎదురవలేదు కావొచ్చు.

**దాదాశ్రీ:** అలాగేం కాదు. డెఫిషిట్ ఉన్నవాళ్ళు కూడా తగిలారు. కానీ వాళ్ళకి ఎటువంటి చింతా లేదు. ఈరోజు ఇంత ఇంటికి తెచ్చుకోవాలి అన్నది మాత్రమే కొద్దిగా వాళ్ళ మనసులో ఉంటుంది. అంత వాళ్ళు తెచ్చుకుంటారు. చింతా గింతా వాళ్ళకేమీ ఉండదు. వాళ్ళు అంతటినీ భగవంతునికే వదిలేస్తారు. “ఆయనకు ఏది మంచి అనిపిస్తే అలాగే జరుగుతుంది” అనుకుంటూ ముందుకుసాగుతారు. కానీ వీళ్ళకి భగవంతుడనేవాడే లేడు, వీళ్ళే కర్తలు కదా! కర్మ చేసేది నేనే, దాని భోక్తను నేనే, మరి చింతనెందుకు తలకెత్తుకుంటావు?

## చింత ఉన్నచోట లక్ష్మి నిలుస్తుందా?

**ప్రశ్నకర్త:** అలా అయితే మరి మనుషులు సంపాదించేందుకు పోనేపోరు, చింత కూడా పెట్టుకోరు.

**దాదాశ్రీ:** అది కూడా కాదు. సంపాదించేందుకు పోవటం కూడా వాళ్ళ చేతుల్లో లేదు. బొంగరంలాంటివాళ్ళు. ప్రకృతి తిప్పినట్లు తిరుగుతారు. కానీ, "నేను వెళ్ళి సంపాదించాను" అనే అహంకారాన్ని పెట్టుకుంటారు, అర్థం లేని వ్యథలు పెట్టుకుంటారు. చింతచేసేవారు రూపాయలు ఎక్కడి నుండి తెస్తారు? లక్ష్మీ స్వభావం ఎలావుంటుందో తెలుసా? ఎక్కడ ఆనందం తాండవిస్తుంటుందో, లక్ష్మి అక్కడే నివాసముంటుంది. లక్ష్మీకోసం చింతించే వాళ్ళ దగ్గర నివాసం ఉండదు. ఆనందంగా జీవిస్తూ, భగవంతుని తలచుకుంటూ ఉండేవాళ్ళ దగ్గరికే లక్ష్మీ వెళ్ళి చేరుతుంది.

## చింతతో వ్యాపారం పడిపోవటమే

**ప్రశ్నకర్త:** వ్యాపారంలో చింత కలుగుతుంటుంది. ఎన్నో అవాంతరాలు ఎదురౌతుంటాయి.

**దాదాశ్రీ:** చింతిస్తున్నావూ అంటే పని చెడిపోతుందని అర్థం చేసుకో. చింతే లేకపోతే పని సక్రమంగా జరుగుతుందని తెలుసుకో. చేసే కార్యానికి చింత ఒక అవరోధం. చింత వ్యాపారినికి మృత్యుసమానం. ఎగుడుదిగుడు ఉన్నప్పుడే అది వ్యాపారమౌతుంది. పూరణ్, గలన్ అంటే, నిండటం, ఖాళీ అవటం ఇదే జరుగుతుంటుంది. నిండిన తర్వాత ఖాళీ అవటం జరగాల్సిందే. అలా నిండటం ఖాళీ అవటంలో మీ ప్రమేయం ఏమీ లేదు. మీ ప్రమేయం ఉంటే, ఇక అందులో నిండటం ఖాళీ అవటమనేదేమీ ఉండదు. అంత స్వచ్ఛమైన వ్యవహారమిది. మీ ఇంట్లో మీ కుటుంబ సభ్యులు భాగస్వాములే కదా!

**ప్రశ్నకర్త:** సుఖ దుఃఖాలలో, కలిమిలేముల్లో భాగస్వాములే.

**దాదాశ్రీ:** మీరు మీ భార్యాపిల్లల సంరక్షకులు కదా! కేవలం సంరక్షకుడే చింతచెందాలా? మీ ఇంట్లో వాళ్ళంతా "మీరు మా గురించి చింతపడకండి" అని కూడా అంటారేమో. చింత వలన ఏమైనా వృద్ధి జరుగుతుందా?

**ప్రశ్నకర్త:** ఏమీ వృద్ధిచెందదు.

**దాదాశ్రీ:** వృద్ధిచెందదా? మరి వ్యాపారం అలా ఎందుకు చేయటం? చింత వలన వ్యాపారాభివృద్ధి అవుతుందంటే అట్లాగే కానీ!

## ఆ అపగాహనతో చింత మాయం

వ్యాపారం చెయ్యాలంటే ఎంతో గుండె నిబ్బరం కావాలి. నీరసపడితే వ్యాపారం పడిపోతుంది.

ఒకసారి మా కంపెనీ నష్టాలలోకి పోయింది–జ్ఞానం కలుగక ముందు. నాకు రాత్రి నిద్రపట్టలేదు. చింతిస్తూనేవున్నా. అప్పుడు అంతరంగం నుంచి సమాధానం లభించింది. "కలిగిన ఈ నష్టానికి ఎవరెవరు వ్యథ చెందుతుండవచ్చు" అని ఆలోచిస్తే, బహుశా నా భాగస్వామి ఏ చీకూచింతా లేకుండా ఉండివుంటాడు అనిపించింది. నేనొక్కడినే దీని గురించి వేదన చెందుతున్నానేమో అని కూడా అనిపించింది. నా భార్యాపిల్లలు ఇందులో భాగస్వాములే. వాళ్ళకి అసలు ఏం జరుగుతున్నదో తెలియదు. అంటే నేనొక్కడినే మందబుద్ధితో అంతా నా మీద వేసుకుని చింతిస్తున్నాను. అందరూ భాగస్వాములే అయినా వాళ్ళకి ఏ చింతా లేదు. అలాంటప్పుడు నేనొక్కడినే ఎందుకు ఈ చింతను నా తలమీద రుద్దుకోవటం?

## ఆలోచించు కానీ, చింతకు లోనవకు

ఏమిటీ చింత అంటే? మనసులో ఒక ఆలోచనా తరంగం పైకి లేచింది అని అనుకోవాలి. మనకు, వ్యాపారం గురించి కాని, వ్యాధి గురించి కాని, లేక వేరే మరేదైనా విషయంలోకాని ఆలోచన వస్తే, కొంత హద్దు వరకు పోయిన తర్వాత అది మనకు అలజడి కలిగిస్తుంది. అలా అలజడి వచ్చిందీ అంటే అది వ్యతిరేక దిశలో పోతోందని అర్థం చేసుకోవాలి– అంటే వ్యవహారం చెడిపోతోంది. అక్కడి నుండే చింత మొదలౌతుంది.

ఆలోచించవచ్చు. దానివలన ఎటువంటి నష్టమూ లేదు. ఆలోచించే అధికారం కూడా మనకి ఉంది. "అయితే బాబూ, ఆలోచన మనసులో అలజడి రేకెత్తించి చింతలోకి

రూపాంతరం చెందుతుందీ అంటే ఆ ఆలోచనను వదిలేయాలి". అటువంటి అబౌ నార్మల్ (అసాధారణమైన) ఆలోచనలనే చింత అంటారు. అందువలన మనం ఆలోచించాలి కాని, అబౌ నార్మల్ అవటం, లోపల్లోపలే మనం కుమిలేట్లుగా చేసే దశకు రాగానే దాన్ని వదిలిపెట్టేయాలి.

**ప్రశ్నకర్త:** అంటే, సాధారణంగా లోపల వచ్చే ఆలోచనలను గమనిస్తూ, అవి చింతలోకి దారితీసినప్పుడు దాని వశంలోకి వెళ్ళిపోతున్నామని భావించాలి.

**దాదాశ్రీ:** చింతలో పడ్డావంటే దాని వశంలోకి వెళ్ళిపోయినట్లే కదా! ఏ మనిషైనా చింతిస్తున్నాడూ అంటే దాని అర్థం అతను అంతా తనే చేస్తున్నాడని అనుకుంటున్నాడని. అటువంటి అభిప్రాయం కలుగుతుంది. చింతిస్తున్నాడంటే దాని అర్థం అంతా నాతోనే నడుస్తోంది అని అతను భావిస్తున్నట్లు. అన్ని చికాకులు పెట్టుకోవలసిన అవసరమేముంది. ఈ వ్యాధి మనుషులందరిలోకీ పాకింది. అంత త్వరగా పోతుందా? అంత త్వరగా పోదు కదా! అలవాటు పడ్డాం. ఎలా పోతుంది? హాబిచ్యువేట్ అయ్యాం.

**ప్రశ్నకర్త:** మీ దగ్గరికి వస్తే అది పోతుంది కదా!

**దాదాశ్రీ:** ఔను పోతుంది కాని, ఒక్కసారే పోదు. నెమ్మది నెమ్మదిగా పోతుంది.

## అధికారం చేతుల్లోకి తీసుకుంటేనే చింత కలుగుతుంది

మీకు ఎలా ఉంటుంది? ఎప్పుడైనా ఆందోళన కలుగుతుందా? చింత పీడిస్తుంటుందా?

**ప్రశ్నకర్త:** నా పెద్ద కూతురు నిశ్చితార్థం జరగటం లేదు. ఆ విషయంలోనే కాస్త ఆందోళన ఉంది.

**దాదాశ్రీ:** మీ చేతుల్లో ఉన్నదానికి మీరు ఆందోళన చెందండి. ఇది మీ చేతుల్లో ఉందా? లేదు కదా! మరి అలజడి ఎందుకు చెందుతారు? ఈ సేరు చేతుల్లో ఉందా లేక ఈయనగారి సోదరి చేతుల్లో ఉందా?

**ప్రశ్నకర్త:** లేదు.

**దాదాశ్రీ:** అంటే మరి ఎవరి చేతుల్లో ఉన్నట్లు? ఈ సంగతి అర్థం చేసుకోకుండానే మానసిక అలజడికి లోనవుతున్నారంటే దాన్ని ఇలా పోల్చవచ్చు- టాంగాలో పదిమందిమి కూర్చుని పోతున్నాం. అది పెద్ద టాంగా, దాన్ని రెండు గుర్రాలు లాగుతున్నాయి, దాన్ని నడిపే అతను నడుపుతుంటే, మీరంతా ఓయ్ అట్లా కాదు ఇట్లా నడుపు, అటు కాదు ఇటు అని అరుస్తుంటే ఏమిటి దాని పర్యవసానం? నడుపుతున్నవాడెవరో చూడండి ముందు! అతనెవరో తెలుస్తే మనకి ఎటువంటి చింతా ఉండదు. ఈ జగత్తునంతా ఎవరు నడుపుతున్నారు? అది తెలుసుకుంటే మనలను ఎటువంటి చింతా బాధించదు. రాత్రిం బవళ్ళు మీరు చింతిస్తున్నారా? ఎంతకాలం చేస్తారలా? దానికి అంతం ఎప్పుడు? అది చెప్పండి నాకు!

మీ కూతురు అన్నీ తనతో తెచ్చుకుందమ్మా! ఏంటి మీరు అలా తీసుకురాలేదా? మీకు ఈ సేఠుగారు దొరికారు కదా! మరి మీ కూతురికి ఎందుకు దొరకరు? మీరు కాస్త నెమ్మదిగా ఉండండి. తాత్పర్యమేమిటంటే, వీతరాగ మార్గంలో ఉంటూ నెమ్మదిగా ఉండకపోతే అది ఆర్తధ్యానమౌతుంది, రౌద్రధ్యానమౌతుంది.

**ప్రశ్నకర్త:** అలా కాదు. ఆదుర్దా పడటం స్వాభావికం కదా!

**దాదాశ్రీ:** అదే, ఆ స్వాభావికమైన ఆదుర్దానే ఆర్తధ్యానం, రౌద్రధ్యానం అంటారు. లోపలున్న అంతరాత్మకు మనం దెబ్బ తగిలేట్లుగా చేస్తున్నాం. ఇతరులెవరికీ దెబ్బతగిలేట్లుగా చేయటం లేదు. అంతవరకు బాగానేవుంది. కానీ, ఇది ఆత్మ మీద వత్తిడి కలిగిస్తోంది.

## చింత వలన కర్మకు అంతరాయం

చింత వలన అంతరాయ కర్మ మధ్యలోకి వచ్చి, చేసే పనిలో జాప్యం కలుగజేస్తుంది. ఫలానా చోట ఒక అబ్బాయి ఉన్నాడని ఎవరైనా చెప్పారనుకోండి! అప్పుడు మీరు మీ ప్రయత్నం చేయండి. చింతించే పనిని దేవుడు నిషేధించాడు. చింత వలన అవరోధాలు ఎక్కువౌతాయి. ఈ విషయంలో వీతరాగ భగవాన్ ఇలా అన్నారు, “బాబూ నీవు చింతపడుతున్నావా, అంటే

నీవే యజమానివనుకుంటున్నావా? ఈ ప్రపంచాన్నంతా నీవే నడుపుతున్నావా ఏమిటి? దీన్ని ఎలా అర్థం చేసుకోవాలంటే, విసర్జన చేసే స్వేచ్ఛ కూడా మనకు లేనప్పుడు, మనమింకేం నడుపుతున్నాం? అది ఆగిపోయినప్పుడు డాక్టర్‌ని పిలవాల్సివస్తుంది. అప్పటి వరకు మనం ఆ శక్తి అంతా మనదే అన్న భావనలో ఉంటాం. కాని, ఆ శక్తి మనది కాదు. ఆ శక్తి ఎవరి ఆధీనంలో ఉన్నదన్నది తెలుసుకోవాలా వద్దా? ఇదంతా నడిపిస్తున్నదెవరు? అమ్మా, నీకైతే తెలుసనుకుంటా. మీ సేఠ్‌గారికి తెలుసనుకుంటా. ఎవరైనా నడుపుతున్నారా లేక మీరే నడుపుతున్నారా?

## అంతా నడుపుతున్న పరిస్థితులు

ఎవరు కర్త? పరిస్థితులే పరిణామాలకు కర్త. ఈ విధంగా యాదృచ్ఛికంగా జరిగే పనిలో, సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ లభించిన తర్వాతనే కార్యం జరుగుతుంది. దీని అర్థమేమిటంటే, మీ చేతిలో ఎటువంటి అధికారాలు లేవని. వాటంతటవే జరుగుతున్న సంఘటనలను జరుగుతున్నట్లుగా చూస్తుండటమే మీ పని. యాదృచ్ఛికంగా జరిగేవన్నీ ఒక దగ్గరకు చేరినప్పుడు, పని దానంతటదే పూర్తవుతుంది. మార్చి నెలలో వర్షం పడాలని ఆశించిన వ్యక్తిని తప్పుపడతాం. జూన్ పదిహేనవ తేదీ వచ్చేసరికి కాకతాళీయంగా జరిగేవన్నీ ఒక దగ్గరికి చేరుతాయి. సమయం వచ్చింది సరే కాని, మేఘాలు సహకరించకపోతే ఏమౌతుంది? మేఘాలు కూడకుండానే వర్షం పడిపోతుందా? మేఘాలు ఒక దగ్గరికి చేరుకుని, వర్షం పడే ఋతువు కూడా వచ్చినప్పుడు, మెరుపులు మెరిసి, సంబంధిత ఇతర కారణాలు కూడా జమకూడినట్లయితే, వర్షం తప్పక పడుతుంది. అంటే, జరగవలసిన పనికి అవసరమైన పరిస్థితులు అన్నీ అనుకూలించటం అవసరం. ఎవరికి వారు తామే అన్నీ చేస్తున్నామనుకుంటారు. కానీ అలా ఆయా పనులకు కర్తగా వ్యవహరించటం కూడా పరిస్థితులు కల్పించినవే. ఒక పరిణామానికి అవసరమైన పరిస్థితులలో ఏ ఒక్కటి లేకపోయినా ఆ పని జరగదు.

## నేనెవరిని అన్నది తెలుసుకుంటే శాశ్వతమైన సమాధానం లభిస్తుంది

నిజంగా మనం తెలుసుకోవలసింది “నేనెవరిని” అన్నది. మీ పేరు మీద వ్యాపారం చేస్తే మీకు ప్రయోజనం కలుగుతుంది. పేరుకి వ్యాపారం చేస్తే మీ చేతికేమీ రాదు. దీని

గురించి కాస్త ఆలోచిస్తే మంచిది కదా, “నేనెవరిని?” అన్నది ఎవరికి వారు తెలుసుకోవలసిందే.

ఈ విధంగా మీ పనిని సానుకూలం చేస్తాను. ఆ తర్వాత మీకెప్పుడూ ఏ విషయంలోనూ చింతించవలసిన అవసరమే పడదు. చింత కలుగుతే మీకు నచ్చుతుందా? ఏం ఎందుకు నచ్చదు?

జీవుడు అనంతకాలంగా తిరుగాడుతూనేవున్నాడు. అనంతకాలం నుంచే! ఎప్పుడైనా ఒక ప్రకాశమానమై జ్ఞాన స్వరూపుడు ఎదురైతే, ఆయన ద్వారా మీకు ముక్తి లభిస్తుంది.

## అలజడి వేరు, చింతన వేరు

**ప్రశ్నకర్త:** అయితే, చింత వలన అహంకారం ఎందుకు వస్తుంది?

**దాదాశ్రీ:** “నేను లేకపోతే ఈ పని జరిగేది కాదు” అని మనిషికి అనిపిస్తుంది. “ఈ పనిని నేనే చేస్తున్నాను. నేనే గనక చెయ్యకపోతే ఆ పని జరిగేదే కాదు ఇప్పుడీ పని అయిపోయింది కాని, రేపు ఏమవుతుందో?” అని చింతిస్తాడు.

**ప్రశ్నకర్త:** చింత అని దేన్నంటారు?

**దాదాశ్రీ:** ఏ విషయంలోనైనా నేనే సర్వస్వం అనుకుని దాని గురించి చేసే చింతనే, చింత అనబడుతుంది. ధర్మపత్ని ఆరోగ్యం చెడిపోయినట్లయితే, డబ్బు కంటే భార్యే సర్వస్వం అనుకుంటే, అక్కడి నుంచే ఆ మనిషికి చింత ప్రారంభమౌతుంది. అతను ఆమెకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చాడు కనుక చింత అనేది లోపలిసి చొచ్చుకునివస్తుంది. ఆత్మే సర్వస్వం అనుకున్న మనిషికి ఇక దేని గురించి ఉంటుంది చింత?

**ప్రశ్నకర్త:** టెన్షన్ (మానసిక ఒత్తిడి) అంటే ఏమిటి? చింత అనేది అర్థమైంది కాని, ఈ ఒత్తిడి ఏమిటో వివరించండి!

**దాదాశ్రీ:** మానసిక ఒత్తిడి కూడా అటువంటిదే. కాని ఇందులో సర్వస్వమనేది లేదు. అన్ని రకాల ఒత్తిడులూ ఉంటాయి. సరైన ఉద్యోగం దొరకటం లేదు ఏం చెయ్యాలి?

మరో పక్క చూస్తే భార్య అస్వస్థత! ఏం చెయ్యాలి? పిల్లవాడు సరిగ్గా బడికి పోడు. వాడి భవిష్యత్తు ఎలా ఉంటుందో? మనసులోని ఈ రకమైన అలజడులన్నీ మానసిక ఒత్తిడులే, వాటినే టెన్షన్స్ అంటాం. మనం ఇరవై ఏడు సంవత్సరాల నుంచి టెన్షన్‌ని చూడనేలేదు కదూ!

ఇక చూస్తే, జాగ్రత్తపడడానికి, చింతకి తేడా ఉంది. జాగ్రత్తపడడం అనేది మెళకువగా వ్యవహరించటం కానీ, చింతలో దహించుకుపోవటం జరుగుతుంది.

## నార్మలిటీ నుంచి ముక్తి

**ప్రశ్నకర్త:** పరాధీనం, చింత రెండూ ఒకటి కావా?

**దాదాశ్రీ:** చింత అనేది అబౌ నార్మల్ ఇగోయిజం అయితే పరాధీనంలో ఇగోయిజమ్ లేనే లేదు. పరాధీనత గత్యంతరం లేని పరిస్థితి, చింత అబౌ నార్మల్ ఇగోయిజం. ఇగోయిజం సాధారణ స్థాయిని మించిపోతే అది చింతలోకి మారుతుంది లేకుంటే కాదు. రాత్రిపూట నిద్రపట్టనిది ఎవరికి? ఇగోయిజం అధికంగా ఉన్నవాళ్ళకే.

ఇగోయిజాన్ని ఉపయోగించుకోండి కాని అబౌ నార్మల్ ఇగోయిజాన్ని కాదు. అంటే, చింతించటమనేది పాపం, దాని పరిణామం జంతు జన్మ.

**ప్రశ్నకర్త:** చింత లేకుండా ఉండాలంటే ఏం చెయ్యాలి?

**దాదాశ్రీ:** వెనక్కి తిరిగివచ్చేయాలి. ఇగోయిజం పూర్తిగా పోవాలి, లేదా దాన్ని తగ్గించుకొని వెనక్కి రావాలి. జ్ఞాని మహాత్ములుంటే, ఆ జ్ఞానులు జ్ఞానాన్ని ప్రసాదిస్తే అప్పుడు అంతా ఔతుంది.

## ఏం చేస్తే చింత పోతుంది?

**ప్రశ్నకర్త:** చింత ఎందుకు మనల్ని వదిలిపెట్టదు? దీని నుంచి విముక్తి లభించాలంటే ఏం చెయ్యాలి?

**దాదాశ్రీ:** చింత పూర్తిగా పోయిన మనిషి మీకు ఎక్కడా కనపడడు. శ్రీకృష్ణుని భక్తునికైనా చింత లేకుండా పోదు కదా! చింత జ్ఞానాన్ని కప్పివేస్తుంది, ముక్కలు ముక్కలు చేస్తుంది.

ప్రపంచంలో చింత అనేదే లేని వ్యక్తి మచ్చుకి ఒక్కడైనా కనపడడు. సాధువైనా, సాధ్వియైనా ఏదో ఒక సమయంలో వాళ్ళకి చింత తప్పక కలుగుతుంది. సాధువులకు ఆదాయపు పన్ను, సేల్స్ ట్యాక్స్ ఉండవు. అద్దె గిద్దె ఏమీ ఉండదు. అయినా ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక విషయంలో చింత కలుగుతుంది. శిష్యుల మధ్య పోటీలు, గొడవలను చూసి కూడా చింత కలుగవచ్చు. చింత పోవటానికి ఏకైక మార్గం ఆత్మజ్ఞానం కలగటం. అది లేకుండా చింత పోవటం అసాధ్యం.

ఒక గంటసేపటిలో మీ చింతలన్నిటినీ నేను తీసుకుంటానని గ్యారెంటీగా చెప్తున్నాను. ఈ మధ్యలో ఒక్క చిన్న చితకా చింత కలిగినా, న్యాయవాది సహాయంతో మీరు నా మీద దావా వేసి కోర్టులో కేసు నడిపించండి. మేము వేలాదిమందిని చింతారహితులను చేసాం. మీరు అడగండి ఏం కావాలో! మీరు అడిగింది మీకు లభిస్తుంది. అయితే అడిగేటప్పుడు జాగ్రత్తగా ఆలోచించి అడగండి. నీ దగ్గరి నుంచి ఎన్నటికీ పోనిది అడగండి. నశ్వరమైన వస్తువులను అడక్కండి. శాశ్వత సుఖాన్ని కోరుకోండి.

మా ఆజ్ఞలో ఉండండి, ఇక చింత అనేది ఏ ఒక్కటీ ఉండదని, అలా ఉన్నట్లయితే నా మీద దావా వేసుకోవచ్చని కూడా మీకు చెప్పాను. కానీ నా ఆజ్ఞలో ఉండాలి. ఇక్కడ అన్నీ లభిస్తాయి. నేను పెట్టిన షరతు ఏమిటో తెలుసా? ఇక్కడ మీకు మనసులో ఒక్క చింత అనేది కలిగినా, నా మీద రెండు లక్షల రూపాయలకు కేసు పెట్టండి.

**ప్రశ్నకర్త:** మీ దగ్గరి నుండి జ్ఞానాన్ని పొంది, మనసా వాచా కర్మణా మమ్మల్ని మీకు అర్పించుకున్న తర్వాత మాకు చింత అనేది ఎందుకు ఉంటుంది, ఉండదు.

**దాదాశ్రీ:** ఔను. ఉండనే ఉండదు.

చింతలు లేని స్థితే సమాధి స్థితి అనబడుతుంది. అయితే ఆ తర్వాత అంతకు ముందుకంటే ఎక్కువ పనే జరుగుతుంది. ఎందుకంటే అలజడి అనేది ఉండదు కదా. ఇంటి గురించి చింత ఉండదు, బయటి చింత ఉండదు, ఏ విధమైన విచారమూ ఉండదు. ఏకాగ్రత సంపూర్ణంగా ఉంటుంది.

## వర్తమానంలో వసించండి

ఒకే ఒక్క కూతురుంటే ఆ అమ్మాయి 3 సంవత్సరాల వయస్సులోకి చేరుకున్నప్పటి నుంచే, ఈ అమ్మాయి పెద్దదయినపుడు పెళ్ళిచేయాల్సివుంటుంది, దానికి ఎంతో ఖర్చు కదా అనే మనోవేదన మొదలౌతుంది. ఇలాంటి చింత వద్దని మీకు చెప్పటం జరిగింది. ఎందుకంటే, ఆ సమయం వచ్చినప్పుడు అదే జరిగిపోతుంది. పరిస్థితులన్నీ అనుకూలించి ఎవిడెన్స్‌లన్నీ జమకూడుతాయి. అందువలన ఆ సమయం వచ్చేంతవరకూ మీరు అందులో కలుగజేసుకోకండి. మీరు మీ పద్ధతిలో మీ కూతురిని చక్కగా పెంచండి, విద్య నేర్పించండి కాని, భవిష్యత్తులో జరిగేదాని గురించి చింతించకండి. వర్తమానంలో చెయ్యవలసిన పనులను సక్రమంగా చేయండి. భూతకాలమైతే గతించింది. దాన్ని కూడా వెలికితీయకండి. జరిగిపోయిన దాన్ని ఎంతటి మూర్ఖుడైనా సరే తిరిగి పెళ్ళగించడు. భవిష్యత్తేమో పరిస్థితుల నియంత్రణలో ఉంది. అందువలన మనం వర్తమానకాలంలోనే జీవించాలి. ఇప్పుడు టీ తాగుతున్నావంటే హాయిగా నిశ్చింతగా తాగు. ఎందుకంటే, భవిష్యత్తు వ్యవస్థ నియంత్రణలో ఉంది. మనకెందుకు దాని గొడవ? అంటే మనం ఉండాల్సింది ప్రస్తుతంలో. భోజనం చేసే సమయంలో మీ దృష్టంతా భోజనం మీదనే ఉండాలి. పకోడి చేస్తే దేనితో చేసారు అన్నది గుర్తించి తినండి. వర్తమానకాలంలో ఉండటమంటే, డేబుక్ (ఖాతా పుస్తకం) రాస్తున్నట్లు. అందులో ప్రస్తుత విషయాలుండాలి కాని భవిష్యత్తులోవి రాస్తే ఆ డేబుక్ సక్రమమైన డేబుక్ అవదు. అందులో తప్పులు దొర్లుతాయి. వర్తమానంలో చరించేవారికి చింత ఉండదు, వాళ్ళు తప్పులూ చేయరు.

## చింత డిశ్చార్జ్ అవదు

**ప్రశ్నకర్త:** చింత డిశ్చార్జా?

**దాదాశ్రీ:** చింత డిశ్చార్జ్ కాదు. అందులో కర్త అనేవాడుంటాడు.

ఛార్జ్ రూపంలో ఉన్న చింత డిశ్చార్జ్ రూపంలోకి మారుతుంది. దాన్ని మనం సఫొకేషన్ అంటాం. ఎందుకంటే ఆ పరిస్థితి మన దృష్టిని లోపలివైపుకి మళ్ళనివ్వదు. ఆత్మ అహంకారినికి పూర్తిగా వ్యతిరేకం కదా. అవి ఏకమైనప్పుడు అది చింత అవుతుంది.

సఫొకేషన్ అనేది ఛార్జ్ అయిన చింత. అది డిశ్చార్జ్ అయినప్పుడు సఫొకేషన్ కలుగుతుంది. ఇది ఎలా జరుగుతుందంటే, చార్జ్ క్రోధంలోకి మారినా, ఆత్మ విడిగా ఉండటం వలన డిశ్చార్జ్ అయినప్పుడు అది కోపంలోకి మారుతుంది. అదే విధంగా, ఎవరిలో అయితే ఆత్మ విడిగా ఉన్నట్లయితే అన్నీ విడివిడిగానే ఉంటాయి.

ఈ జ్ఞానం కలిగిన తర్వాత, చింత అనేదే ఉండదిక. అది కేవలం సఫొకేషనే. చింత ఉన్న ముఖాన్ని గుర్తుపట్టవచ్చు. ఇది సఫొకేషన్, వత్తిడి మాత్రమే.

మీకో దారి చూపించినప్పుడు, దాన్ని మీరు అర్థం చేసుకోవటంలో తప్పుచేస్తే, మీలో అలజడి కలుగుతుంది. అది చింత కాదు. అది వత్తిడి మాత్రమే. అంటే, చింతలు ఉండవు. చింతలలో రక్తం మరగటం జరుగుతుంది.

## వ్యవస్థ పనితీరు గురించి తెలుసుకుంటే చింత మాయం

**ప్రశ్నకర్త:** వ్యవస్థలో జరిగే పనితీరు ఎలా ఉంటుందన్నది తెలుసుకుంటే చింత లేక వత్తిడి అనేవేమీ ఉండవా?

**దాదాశ్రీ:** ఏమాత్రం ఉండవు. వ్యవస్థ అంటే సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్. చివరకు "అంతిమ వ్యవస్థ", కేవల జ్ఞానాన్ని ఉత్పన్నం చేస్తుంది, అప్పుడు "కేవల జ్ఞానం" అర్థమౌతుంది. అప్పటి వరకు వ్యవస్థను అర్థం చేసుకుంటూపోండి. వ్యవస్థను గురించి తెలుసుకుంటే అది ఎంతో సుందరంగా ఉంటుంది. అది ఎంతో గొప్ప శోధన.

అనాదిగా వస్తున్న ఇన్ని జన్మల పరంపరల నిర్వహణను ఎవరు చూస్తున్నారు? దానికి ఎవరైతే కర్తగా వ్యవహరిస్తున్నారో, అతని చింత!

**ప్రశ్నకర్త:** ఈ జ్ఞానంతో నాలో భవిష్యత్తు గురించిన చింత సమసిపోయింది.

**దాదాశ్రీ:** ఇదంతా ఒక వ్యవస్థ అని మీరు అంటూవుంటారు కాని, ఇప్పుడు అదేమిటో అర్థమైంది కదూ! మీరు రాత్రంతా కూర్చుని రెండు సంవత్సరాల తర్వాత విషయం మీద ఆలోచించటం వలన ఏమైనా తేడా వస్తుందా అందులో? అది యూజ్‌లెస్ అవుతుంది. "వేస్ట్ ఆఫ్ టైమ్ & ఎనర్జీ"

**ప్రశ్నకర్త:** రియల్, రిలేటివ్‌ల గురించి మాకు వివరించటం వలన మాలో చింత పూర్తిగా పోయింది.

**దాదాశ్రీ:** ఆ తర్వాత మళ్ళీ ఎప్పుడూ చింత అనేదే కలుగదు, ముఖ్యంగా ఈ జ్ఞానం కలిగిన తర్వాత. ఇది సంపూర్ణ వీతరాగ మార్గం. సంపూర్ణ వీతరాగ మార్గమంటే, "చింత అనేదే లేని స్థితి". ఇది, ఆత్మజ్ఞానులందరి, ఇరవై నాలుగు తీర్థంకరుల మార్గమే కాని వేరెవరిదీ కాదు.

**-జై సచ్చిదానంద!**

## శుద్ధాత్మకి ప్రార్థన

హే అంతర్యామీ పరమాత్మా! నీవు నాలో ఉన్నవిధంగానే జీవులందరిలో విరాజమానమై వున్నావు. నీ యొక్క దివ్య స్వరూపమే నా నిజ స్వరూపము. నా నిజ స్వరూపము పవిత్ర ఆత్మ.

హే శుద్ధాత్మ భగవాన్! నేను నీకు అభేదభావముతో అత్యంతభక్తి పూర్వకంగా నమస్కరించుచున్నాను.

అజ్ఞానవశాత్తు నేను చేసిన తప్పులనన్నింటిని ❖ నీ ముందు ఒప్పుకొనుచున్నాను. నేను ఈ తప్పులకు పశ్చాత్తాపం చెందుతూ నీ క్షమకై అర్థిస్తున్నాను. ప్రభూ! దయతో నన్ను క్షమించు, నన్ను క్షమించు, నన్ను క్షమించు. ఆ తప్పులను మరల చేయకుండునట్లు నాకు శక్తిని ప్రసాదించు.

హే శుద్ధాత్మ భగవాన్! మాకు నీతోగల భేద భావము తొలగిపోయి మేమందరము నీతో అభేదతను పొందునట్లు ఆశీర్వదించు. మేము సదా నీతో అభేదతతో తన్మయాకారతను చెందెదము గాక!

(❖ గతంలో నీవు చేసిన తప్పులను గుర్తు తెచ్చుకోవాలి)

## ప్రతిక్రమణ : దివ్యమైన క్షమాపణా విధానము

నేను దాదా భగవాన్ సాక్షిగా ❖...................... యొక్క మనోవచన కాయము కంటె పూర్తిగా వేరైన పవిత్రాత్మకు నమస్కరించుచున్నాను.

నేను నా తప్పులను జ్ఞప్తికి తెచ్చుకొన్నాను (ఆలోచన) ❖❖

ఆ తప్పులకై నేను క్షమాపణ కోరుచున్నాను (ప్రతిక్రమణ)

ఆ తప్పులను మరల చేయనని దృఢముగా నిశ్చయించుకొనుచున్నాను (ప్రత్యాఖ్యాన్)

ప్రియాతి ప్రియమైన దాదాభగవాన్! ఈ దృఢ నిశ్చయమును పాలించు శక్తిని నాకు అనుగ్రహించు.

❖ మీ వలన గాయపడిన వ్యక్తి పేరు

❖❖ ఆ వ్యక్తిపట్ల మీరు ఒనర్చిన దోషాలను గుర్తుచేసుకోవాలి.

## తెలుగులో దాదా భగవాన్ పుస్తకాలు

| | | | |
|---|---|---|---|
| 1. | అన్ని చోట్లా సర్దుబాటు | 6. | చింత |
| 2. | విభేదాలను తొలగించడానికి | 7. | నేను ఎవరు? |
| 3. | ఎలాగైనా జస్టిస్ జరిగింది | 8. | భావనతో మెరుగుపడతాయి జన్మ-జన్మలు |
| 4. | బాధితుడు తప్పిదము | 9. | మృత్యు సమయం దానికి ముందు, దాని తర్వాత... |
| 5. | క్రోధం | | |

❖ తెలుగులో మరిన్ని పుస్తకాలు జోడించబడుతున్నాయి మరియు త్వరలో అందుబాటులోకి వస్తాయి.


## Books of Dada Bhagwan in English

| | | | |
|---|---|---|---|
| 1. | Adjust Everywhere | 19. | Money |
| 2. | Ahimsa: Non-Violence | 20. | Noble Use of Money |
| 3. | Anger | 21. | Pratikraman |
| 4. | Aptavani-1 | 22. | Pure Love |
| 5. | Aptavani-2 | 23. | Right Understanding to Help |
| 6. | Aptavani-4 | | Others |
| 7. | Aptavani-5 | 24. | Science of Karma |
| 8. | Aptavani-6 | 25. | Science of Speech |
| 9. | Aptavani-8 | 26. | Shree Simandhar Swami : |
| 10. | Aptavani-9 | | The Current Living Tirthankar |
| 11. | Autobiography of Gnani | 27. | Simple & Effective Science of |
| | Purush A.M Patel | | Self-Realization |
| 12. | Avoid Clashes | 28. | The Essence Of All Religion |
| 13. | Brahmacharya: Celibacy | 29. | The Fault Is Of The Sufferer |
| | Attained with Understanding | 30. | The Guru and The Disciple |
| 14. | Death: Before, During & | 31. | The Hidden Meaning Of |
| | After… | 32. | The Practice Of Humanity |
| 15. | Flawless Vision | 33. | Trimantra |
| 16. | Generation Gap | 34. | Whatever Happened is Justice |
| 17. | Harmony in Marriage | 35. | Who Am I? |
| 18. | Life Without Conflict | 36. | Worries |

❖ Dada Bhagwan books are available in different languages: Gujarati, Hindi, English, Marathi, Telugu, Kannada, Oriya, Malayalam, Bengali, Punjabi, Assamese, Tamil, German, Spanish, Russian, etc.

❖ 'Dadavani' Magazine is published every month in three languages: Gujarati, Hindi & English.

# దాదా భగవాన్ ఫౌండేషన్ తెలుగు యూట్యూబ్ ఛానల్




❖ ఇది అడాలజ్ దాదా భగవాన్ ఫౌండేషన్ యొక్క అధికారిక తెలుగు యూట్యూబ్ ఛానెల్.

❖ దిగువ లింక్ నుండి తెలుగు భాషలో సత్సంగ వీడియోలను చూడండి.

**'Dada Bhagwan Foundation Telugu' Channel:**

https://dbf.adalaj.org/yttelugu

*Open Link OR*

*Scan QR*

YouTube

---

*Dada Bhagwan Foundation Youtube video channels are available in other regional languages: Gujarati, Hindi, Marathi, Bengali, Tamil, Telugu, Kannada, Malayalam, Spanish, Portuguese, etc.*

# Persons to Contact

## Dada Bhagwan Foundation

**Adalaj** : **Trimandir**, Simandhar City, Ahmedabad-Kalol Highway
P/O: Adalaj, Dist. Gandhinagar - 382421, Gujarat, India.
Tel: +91-9328661166 / 9328661177
E-mail : info@dadabhagwan.org

**Mumbai** : **Trimandir**, Rushivan, Kajupada, Borivali (E)
Tel: +91-9323528901

| | | | |
|---|---|---|---|
| **Kolkata:** | 9830093230 | **Delhi:** | 9810098564 |
| **Jaipur:** | 9351408285 | **Chennai:** | 7200740000 |
| **Bhopal:** | 9425024405 | **Patna:** | 7352723132 |
| **Indore:** | 9039936173 | **Amravati:** | 9422915064 |
| **Raipur:** | 9329644433 | **Bangalore:** | 9590979099 |
| **Chandigarh:** | 9780732237 | **Hyderabad:** | 9989877786 |
| **Kanpur:** | 9452525981 | **Pune:** | 9422660497 |
| **Bhubaneswar:** | 8763073111 | **Jalandhar:** | 9814063043 |
| **Varanasi:** | 9795228541 | **Sangli:** | 9423870798 |

| | |
|---|---|
| **USA: Dada Bhagwan Vignan Institute**<br>Tel: + 1-877-505-DADA (3232)<br>Email: info@us.dadabhagwan.org | **U.K: Dada Darshan (UK)**<br>Tel: +44 330-111-DADA (3232)<br>Email: info@uk.dadabhagwan.org |
| **Germany** : +49 700 32327474<br>**UAE** : +97 1557316937<br>**Kenya** : +25 4722722063<br>**Dubai** : +971 501364530 | **Australia** : +61 421127947<br>**Singapore** : +65 81129229<br>**New Zealand** : +64 210376434 |

Website : www.dadabhagwan.org



## మీరు చేసే పనులకు చింత అవరోధాన్ని కలిగిస్తుంది

ప్రయత్నం చేయి కానీ, చింతపడకు. పని జరగటం లేదంటే దాని గురించి ప్రయత్నం చేయమని ప్రకృతి చెప్తుంది. ప్రయత్నం ముమ్మరం చేయి కాని, దాని గురించి చింతించవద్దు. ఎందుకంటే చింత ఆ కార్యాన్ని దెబ్బతీస్తుంది. చింతించేవారు నియంత్రణను తమ చేతుల్లోకి తీసుకుంటారు, "నేనే అంతా నడిపిస్తున్నాను" అనే రీతిలో. దానితోనే పాపం ప్రారంభమౌతుంది.

"ఈ ప్రపంచాన్ని ఎవరు నడుపుతున్నారు?" ఈ సంగతి అర్థం చేసుకుంటే మనకిక చింత అనేదే కలుగదు.

-దాదాశ్రీ

dadabhagwan.org

ISBN 978-93-91375-29-4

Printed in India

Price ₹ 20